# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి: 43 సంచిక: 18 విజయవాడ 20-1-2011 పేజీలు: 8 వెల: రు 5.00


**లోపలి పేజీల్లో...**


- బ్రిటన్‌ను చుట్టుముట్టిన సంక్షోభం
- వివిధ దేశాలలో కార్మికుల ఆందోళనలు
- బహిరంగ పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులు
- రైతాంగాన్ని దోపిడీ చేస్తున్న నాసిరకం విత్తన-పురుగుమందు కంపెనీలు
- పరువు హత్యల పేరిట మహిళలపై, దళితులపై అఘాయిత్యాలు
- జైత్‌పూర్ అణువిద్యుత్ కేంద్ర వ్యతిరేక ఆందోళన


# అధిక ధరల సంక్షోభంతో పాలకుల దోబూచులాట

**రెండు** రోజుల పాటు సుదీర్ఘ చర్చల తర్వాత మన్‌మోహన్‌సింగ్ ప్రభుత్వం ఆహార సరకుల ధరల పెరుగుదలను అరికట్టడానికి తక్షణ చర్యలు తీసుకోగల స్థితిలో లేనని చేతులెత్తేసింది. ఇప్పటివరకూ సరుకు దాచిపెట్టిన కొద్దిమంది చిన్న వ్యాపారులపై దాడులు చేయటమనే ప్రదర్శనాత్మక చర్యలు కూడా ఎలాంటి ఫలితాన్నీ యివ్వలేదు. ప్రపంచవ్యాపితంగానే ఆహార సరుకుల ధరలు పెరుగుతున్నాయనీ, దేశంలో కొనుగోలు శక్తి పెరిగి ఆహార వినియోగం పెరిగినందున ధరలు పెరిగాయనీ (చైనా, భారత్‌లలో ప్రజలు ఎక్కువగా తింటున్నందున ధరలు పెరిగాయన్న బుష్ మాటలు గుర్తున్నాయా?) అతివృష్టి వల్ల పంటలు దెబ్బతిన్నాయనీ పొంతనలేని వాదనలతో తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోజూస్తున్నది. ప్రజల ఆహారంలో తప్పనిసరి భాగమైన ఉల్లిపాయలనే ఉదాహరణగా తీసుకుని పరిశీలిస్తే ఆహార ధరల పెరుగుదలకు కారణాలు అర్ధమౌతాయి.

గత పదేళ్లలో దేశంలో ఉల్లిపాయల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. సాగుభూమి విస్తీర్ణంతో పాటు ఎకరాకు దిగుబడులు కూడా పెరిగాయి. 1996-97లో 4,04,000 ఎకరాల నుండి 8,34,000 ఎకరాలకు సాగువిస్తీర్ణం పెరిగింది. అదే కాలంలో ఉత్పత్తి 41,80,000 టన్నుల నుండి 1,35,65,000 టన్నులకు పెరిగింది. అదే కాలంలో దిగుబడులు కూడా హెక్టారుకు 10.35 టన్నుల నుండి 16.26 టన్నులకు పెరిగింది. 2009లో ప్రతికూల వాతావరణం వల్ల గుజరాత్‌లోనూ మహారాష్ట్రలోనూ ఉత్పత్తి తగ్గినప్పటికీ రాజస్థాన్‌లో పెరిగిన ఉత్పత్తి ఆ లోటును తీర్చింది. ఇప్పుడు 2010 అతివృష్టి వల్ల 20 శాతం పంట దెబ్బతిన్నదంటున్నారు గానీ ధరలు పెరుగుదలకు దీనిని కారణంగా చెప్పలేము. ఎందుకంటే ఉల్లిపాయలు-టోకు మార్కెట్లకు చేరుతున్న పంట పరిమాణంలోగానీ, టోకు ధరల్లోగానీ గత పదేళ్ల సగటుకు సమానంగానే ఈ ఏడాది కూడా వున్నాయి. అంటే కొన్ని రాష్ట్రాల్లో పంట దెబ్బతిన్నా మిగిలిన రాష్ట్రాల్లో పంట ఆ లోటును తీర్చింది. అలాగే టోకు ధరలు కూడా డిసెంబరు నెల రెండవ అర్ధభాగం తప్ప అన్ని టోకు మార్కెట్లలోను సగటు ధరకు దరిదాపుగానే వున్నాయి. అయినప్పటికీ ఉల్లిపాయల ధర ఒక దశలో కేజీ 60రూ॥ దాటింది. ఆనాటికీ ఏ టోకు మార్కెట్టులోనూ రైతుకు చెల్లించిన ధర కేజీకి 6రూ॥లు మించలేదు. బడావ్యాపారులు సరుకును మార్కెట్టులోకి రాకుండా తొక్కిపెట్టటమే కారణమన్నది స్పష్టమే. దీనికి ప్రభుత్వ విధానం కూడా తోడయింది.

ఉల్లిపాయల ఎగుమతిని ప్రభుత్వ సంస్థ నాఫెడ్ నిర్వహిస్తుంది. 1981-82లో 2 లక్షల టన్నుల లోపుగా వున్న ఉల్లి ఎగుమతులు గత ఏడాది 18 లక్షల టన్నులకు పైగా జరిగాయి. 2010లో ఈ ఎగుమతులు 11,58,000 టన్నుల మేరకు జరిగాయి. వీటికి వచ్చిన సగటు ధర కేజీకి 13 రూ॥లు. సెప్టెంబరు నుంచీ వానలు పడుతున్నా (అతివృష్టి వల్లే ధరలు పెరిగాయంటున్న ప్రభుత్వం) ఎగుమతులను ఆపేందుకు ప్రభుత్వం పూనుకోలేదు. నవంబరు నెలలో కూడా (డిసెంబరు నెల వివరాలు ఇంకా విడుదల కాలేదు) మిగిలిన అన్ని నెలల కంటే అత్యధికంగా 1,33,263 టన్నుల ఉల్లిని నాఫెడ్ ఎగుమతి చేసింది. (గణాంక వివరాలు హార్టికల్చర్ డిపార్ట్‌మెంటు వెబ్‌సైటు నుండి సేకరణ)

డిసెంబరు నెల రెండవ అర్ధభాగంలో జరిగిన ఒక సర్వే ప్రకారం అన్ని టోకు మార్కెట్లలోనూ ఉల్లి సగటు ధర 20రూ॥ మించలేదు. అదే సమయంలో చిల్లర మార్కెట్టు ధర కేజీ 40 నుండి 50రూ॥ల వరకూ వుంది.

ఉల్లి రైతాంగానికి 2010లో సగటున అందిన ధర కేజీకి 7రూ॥లు మించలేదు. ఒక్క డిసెంబరు నెలలోనే అది 13రూ॥లకు చేరింది. అది కూడా నాసిక్ మార్కెట్టులోనే. మరోవైపున కేజీ 13రూ॥లకు విదేశాలకు ఎగుమతులను చేశారు. సామాన్యుడికి మాత్రం ఉల్లి ధర 50రూ॥లకు చేర్చారు. చివరకు ధరలనదుపు చేసే చర్యలు తీసుకుంటున్నామన్న హామీలో భాగంగా చౌక ధరల దుకాణాల ద్వారా ఉల్లి అమ్మకం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనికి అది నిర్ణయించిన ధర 33రూ॥. మరో మాటల్లో చెప్పాలంటే ప్రభుత్వం ఉల్లి కనీస రేటును 33రూ॥లుగా నిర్ణయించింది. గుత్త వ్యాపార వర్గాలకు లాభాలు కట్టబెట్టే తన విధానాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఉల్లి దిగుమతులను పాకిస్తాన్ ఆపివేసిందంటూ అర్ధంలేని వివాదం సృష్టించారు. లక్షా 33వేల టన్నుల ఉల్లిని తానే ఎగుమతి చేసి 4 వేల టన్నుల దిగుమతికి ఏర్పడిన ఆటంకాన్ని గురించి హడావుడి చేస్తున్నారు. గత ఆగస్టు నెలలో సింధునదికి వచ్చిన వరదలతో పాకిస్తాన్‌లో గోధుమ, ప్రత్తి, ఉల్లి పంటలు 50 శాతం పైగా దెబ్బతిన్నాయి. దేశంలో ఉల్లి ధరలు పెరగకుండా వుండేందుకు పాకిస్తాన్ ప్రభుత్వం ఉల్లి ఎగుమతులను ఆపివేసింది. అదే సమయం భారతదేశంలో ప్రత్తి ధర పెరిగి మిల్లులు యిబ్బంది పడతాయని ప్రత్తి ఎగుమతులను భారత ప్రభుత్వం నిషేధించింది. తమ మిల్లులు మూతపడకుండా వుండేందుకు తనకు ప్రత్తి పంపిస్తే, ఉల్లి ఎగుమతులు చేస్తానని పాకిస్తాన్ కోరింది. అంతర్జాతీయ వాణిజ్యం యిచ్చిపుచ్చుకునేదిగానే వుంటుంది గనుక జరిగింది సర్వసాధారణమే. అయినా లక్షల టన్నులు ఎగుమతి చేస్తూ నాలుగు వేల టన్నులు దిగుమతి ఆపారంటూ యాగీ చేయటం తాను చేసిన పాపాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నమే.

టమోటాలు కిలో 25 పైసలకు కొనేవారు లేక రోడ్డు మీద పారబోసిన రైతాంగమున్న కర్నూలు జిల్లాలోనూ ఈనాడు టమోటా కేజీ 50రూ॥లకు అమ్ముతున్నారు. సామాన్యుడి ఆహారం ఉత్తర దేశంలో పప్పు, చపాతీలు. దక్షిణదేశంలో పప్పుచారు, అన్నం. పప్పుధరలు పెరిగిపోవటంతో ఏం తినాలో తెలియని స్థితిలోకి సామాన్యుడిని నెట్టారు. దీనికి కారణాలు స్పష్టమే. అనేక దొంతర్లతో ఏర్పడిన మధ్యదళారుల వ్యాపార వ్యవస్థ వ్యవసాయ ఉత్పత్తుల ధరలను నిర్ణయించటమే.

ఈ వాస్తవాన్ని అందరూ అంగీకరిస్తున్నారు. రైతుకు అందుతున్న ధరకూ, సామాన్యుడు కొనుగోలు చేయాల్సిన ధరకూ మధ్య 200 నుండి 400 శాతం వరకూ తేడా వుంటున్నది. దీనికి పరిష్కారమేమిటన్నదే సమస్య. తమ విధానాల ఫలితంగా పెరుగుతున్న ధరలనూ, తత్పర్యవసానంగా ప్రజలకు కలుగుతున్న కష్టాలనూ కూడా గుత్త వ్యాపార వర్గాలను పెంచటానికి సాకుగా వాడేందుకే పూనుకుంటున్నారు.

టోకు వ్యాపారులు సరుకులను దాచిపెట్టి ధరలను పెంచివేస్తున్నారని అర్ధమౌతూ కూడా ప్రభుత్వం నలుగురి వ్యాపారుల మీద తూతూ మంత్రంగా దాడులు చేయటం, ఎగుమతులపై నిషేధం విధించటం వంటి ప్రదర్శనాత్మక చర్యలతో మోసం చేస్తున్నారు తప్ప అత్యవసర సరుకుల చట్టాన్ని వ్యాపారస్తుల పై ప్రయోగించి, దొంగ నిల్వలను బయటకు తియ్యరు. కాగా యిదేదో గంభీరమైన సమస్య అన్నట్లు తక్షణ చర్యలకు అందనిదిగానూ చిత్రిస్తున్నారు. ఇంతచేసి వారనుకుంటున్న పరిష్కారాన్ని చూపుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం సూచించిన చర్యలిలా వున్నాయి. కూరగాయలు తదితర వ్యవసాయ సరుకుల రవాణాపై వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగు చట్టం నుండి మినహాయించాలి. ఉత్పత్తుల నష్టాన్ని నివారించేందుకు సరఫరాలోకి పెట్టుబడులనూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించాలి, అగ్రిబిజినెస్‌ను ప్రోత్సహించాలి.


**(తరువాయి 2వ పేజీలో)**


**సంపాదకీయం**

# ఆదివాసులపై ఒలికిన "ప్రేమ"

**జాతీయ** అభివృద్ధి మండలి సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని మన్మోహన్‌సింగ్ "సుపరిపాలన మాత్రమే భాగస్వామ్య, సాధికారికత భావనలను ప్రజల్లో నెలకొల్పుతుంది. ఈ సందర్భంగా అటవీ హక్కుల చట్టం, 'పెసా' చట్టం అమలు కీలకాంశంగా వుంటుంది. ఈ చట్టాల స్ఫూర్తిని అమలు జరపటంలో వైఫల్యం చెందితే నిర్లక్ష్య పరచబడ్డ ప్రాంతాల అభివృద్ధి పట్ల మన నిబద్ధత ప్రశ్నార్ధకమౌతుంది" అన్నారు.

ఈ ఏడాది బడ్జెట్టు ఉపన్యాసంలో ప్రణబ్ ముఖర్జీ వామపక్ష తీవ్రవాదానికి లోనైన 33 జిల్లాల్లో అభివృద్ధి ప్రణాళికను ప్రణాళికా సంఘం రూపొందిస్తున్నదని తెలిపాడు. దీనిప్రకారం ప్రణాళికా సంఘం ఒక పథకాన్ని రూపొందించింది. 2010-11 నుండి 2013-14 వరకూ నాలుగేళ్ళలో రూ॥ 13,000 కోట్ల వ్యయంతో ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి మూడు విధాలైన చర్యలను సూచించింది. ఒకటి : షెడ్యూల్డు ప్రాంతాలకు పంచాయితీరాజ్ విస్తరణ చట్టాన్ని (పెసా) విస్తరించి, స్థానిక సంస్థలకు అధికారాలనూ, వనరులనూ బదలాయించాలి. రెండు : అటవీ ఉత్పత్తులకు అతితక్కువ ధరలతో ఆదాయాలు లేక అశాంతి ప్రబలుతున్నందున, వీటి అమ్మకాల నియంత్రణను గ్రామ సభలకు బదలాయించాలి. మూడు : అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేసి ఆదివాసీ భూమి హక్కులను స్థిరపరస్తూ పట్టాలు యివ్వాలి. ఈ విధానాన్ని అమలు చేయవలసిన ప్రాంతాలను ఎంపిక చేసేందుకు జనాభాలో ఆదివాసులు 24 శాతంగా వుండటం, 30 శాతం అటవీ ప్రాంత ముండటం, దారిద్ర్యరేటు 50 శాతంగా వుండటాలను అర్హతలుగా నిర్ధారించింది. 2008 ప్రణాళికా సంఘం నియమించిన నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగానే ప్రణాళికా సంఘం ఈ పథకాన్ని రూపొందించింది.

దీని కొనసాగింపుగా భారత ప్రభుత్వం రెండు చర్యలు తీసుకొంది. 2010 సెప్టెంబరులో ఆదివాసీ సంక్షేమ జాతీయ మండలిని ఏర్పాటు చేసింది. దీనికి అధ్యక్షులుగా ప్రధాని వుంటారు. 18 మంది సభ్యులుగల ఈ మండలిలో కీలక శాఖల కేంద్ర కాబినెట్ మంత్రులు, రాజ్యాంగ చట్టపు 5వ, 6వ అధికారణాల్లోని రాష్ట్రాల ముఖ్యమంత్రులూ, ఇద్దరు నిపుణులూ సభ్యులుగా వుంటారు. ఆదివాసుల జీవితాలను మెరుగుపరిచే విధానాలకు ఈ మండలి మార్గదర్శకాలను రూపొందిస్తుంది. అటవీ హక్కుల చట్టం, పెసా ల అమలును సమీక్షిస్తుంది. జాతీయ అభివృద్ధి మండలి సమావేశం జరిగేటప్పుడే ఈ మండలి కూడా సమావేశమౌతుంది.

రెండు : 60 ఆదివాసీ, వెనుకబడ్డ జిల్లాలకు సమీకృత కార్యాచరణ ప్రణాళికను డిసెంబరు నెలలో ప్రకటించింది. ఈ 60 జిల్లాల్లో రెండేళ్ళలో జిల్లాకు 55 కోట్ల చొప్పున ఖర్చు చేస్తారు. అంటే మొత్తం రూ॥ 3300 కోట్లు. దీనికి ఉపప్రణాళికలను కూడా రూపొందించారు. ఈ నిధులలో ఎక్కువభాగం రోడ్ల నిర్మాణానికీ, పోలీసుస్టేషన్ల ఏర్పాటుకూ ఖర్చవుతాయి. ప్రణాళికా సంఘం ప్రతిపాదించిన రూ॥ 13,000 కోట్లను రూ॥ 3,300 కోట్లకు కుదించారన్న సంగతలావుంచితే, దీనినమలు జరిపేదెవరు? పైన పేర్కొన్న ప్రధానమంత్రి, ఆర్ధిక మంత్రుల మాటలను నమ్మినవారి ఊహకు కూడా అందదు. ఈ కార్యాచరణ ప్రణాళికను అమలు జరిపేది జిల్లా స్థాయిలో నియమించిన కమిటీలు. ఈ కమిటీలో సభ్యులెవరు? జిల్లా కలెక్టరు, జిల్లా పోలీసు సూపరింటెండెంట్, జిల్లా ఫారెస్టు అధికారి.

1996లో ఆమోదించిన పెసా చట్టాన్ని అమలు పరిచే చర్యలను ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వమూ తీసుకోలేదు. 2006లో ఆమోదించిన అటవీ హక్కుల చట్టం అమలు కూడా ఇదే స్థితిలో వుంది. భూమినుండీ, అడవి నుండీ ఆదివాసులను దూరంచేయటాన్ని నివారించే లక్ష్యంతో ఈ చట్టాలు చేస్తున్నామని పాలకులు చెప్పుకున్నారు. కానీ ఈ చట్టాలు చేసిన తర్వాత ప్రత్యక్షంగా ఐదులక్షలు, పరోక్షంగా 50 లక్షల ఆదివాసులను గనుల తవ్వకం పేరిట నిర్వాసితులను చేశారు. ఏనాడూ, ఎక్కడా అమలు జరపని ఈ చట్టాల అమలును సమీక్షించేందుకు ఏడాది కొకసారి కూడా సమావేశమౌతుందో లేదో తెలియని మండలికి అప్పగించారు. ఆ విధంగా కొద్ది పరిమితుల్లోనైనా ఆదివాసీలకు సాధికారతనిచ్చే చట్టాల అమలు తద్దినాలు పెట్టే తంతుగానే వుంచుతామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

గ్రామ సభలకు అధికారాలనిచ్చిన పెసా చట్టాన్ని అమలు చేయాలన్న వారి మాటలలో ఏ మాత్రమైనా నిజాయితీ వుంటే, కనీసం కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన, అమలునైనా గ్రామ సభలకు అప్పగించివుంటే పెసా అమలుకు ప్రారంభ చర్యగా వుండేది. పోనీ ఎన్నికయిన జిల్లా పరిషత్తులకయినా యివ్వలేదు. భారత దోపిడీ పాలక వర్గాల నిరంకుశ పాలనకు ప్రతినిధులుగా వుండి, షెడ్యూల్డు ప్రాంతాల్లో ఆదివాసీల అణచివేతకు ఎవరైతే మూల స్థంభాలుగా వున్నారో ఆ అధికారత్రయానికే కార్యాచరణ ప్రణాళిక అమలును అప్పగించటం ద్వారా ఐక్య ప్రగతిశీల కూటమి ప్రభుత్వం 'సాధికారికత' తనకొక వంచనా నినాదమే తప్ప ఆచరణీయ విధానం కాదని స్పష్టం చేసింది.

జాతీయ సలహా మండలి సభ్యుడు ఎన్.సి. సక్సేనా అధ్యక్షతన ఏర్పడిన అటవీ హక్కుల జాతీయ కమిటీ ఈ చట్టం ఆమోదించబడి మూడేళ్లు దాటిన తరువాత కూడా దీనినమలు చేసేందుకు 11 రాష్ట్రాలు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని పేర్కొంది. మిగిలిన రాష్ట్రాల్లో దీని అమలు అంతంత మాత్రమేననీ చెబుతూ, ఫలితంగా వలస పాలనలో ఆదివాసులకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని సరిచేసే ఈ చట్టపు ప్రయోజనం నెరవేరకుండా పోయిందని వ్యాఖ్యానించింది. ఈ వాస్తవ పరిస్థితి తెలిసి కూడా అటవీ హక్కుల చట్టం క్రింద లక్షలాది ఎకరాల షెడ్యూల్డు ప్రాంతాల్లోని భూమిపై ఆదివాసులకు


**(తరువాయి 2వ పేజీలో)**

# బ్రిటన్ : చుట్టుముట్టిన సంక్షోభపు సుడిగుండం

**బ్రిటన్** ఆర్థిక వ్యవస్థ పతనావస్థకు చేరువలోవుంది. తీవ్ర ప్రజానిరసనల కెరటాలపై అది సవారీ చేస్తున్నది.

గత ఎన్నికలలో టోరీ–ఉదారవాద–ప్రజాస్వామిక సంకీర్ణ ప్రభుత్వం డేవిడ్ కామరూన్ నాయకత్వంలో అధికారంలోకి వచ్చింది. వస్తూవస్తూ 156 బిలియన్ డాలర్ల దేశీయ రుణాన్ని మోసుకొచ్చింది. తీవ్ర ఆర్థిక మాంద్యానికి, దుర్భర పరిస్థితులకు దేశాన్ని గురిచేసిన గత లేబర్ పార్టీ ప్రభుత్వం పెద్ద ఎత్తున అప్పులు చేసి బడ్జెట్‌లోటును పూడ్చటం ద్వారా ఈ పరిస్థితులను దాచేందుకు ప్రయత్నించింది. దేశీయరుణం తీవ్ర స్థాయికి చేరుకొంది. ఇక, కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మునిగి పోతున్న ఓడను గట్టెక్కించటం కోసమని 'కఠిన'మైన ప్రజా వ్యతిరేకమైన నిర్ణయాలు తీసుకుంటున్నది. ఖర్చుల గురించిన సమగ్ర సమీక్షలను చేపట్టింది. 83 బిలియన్ డాలర్ల మేరకు ప్రభుత్వ ఖర్చులలో కోత విధిస్తున్నట్లుగా ప్రకటించింది. సంక్షేమ పథకాలపై విధించే 7 బిలియన్ డాలర్లు కూడా ఈ కోతలో వున్నాయి. వివిధ ప్రభుత్వ శాఖలలో విధించే 19 శాతం కోతల ఫలితంగా 5 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. సేవలను పొందుతున్నారనే పేరిట బ్యాంకు నిల్వలపై 'లెవీ' భారాలను మోపారు. విదేశీరాయబారుల సంఖ్యను కుదించటం ద్వారా ప్రభుత్వ విదేశాంగశాఖ తన ఖర్చులలో 24 శాతాన్ని రాబోయే 4 సంవత్సరాల కాలంలో కోత విధించాలని ప్రతిపాదించింది. బిబిసి ప్రపంచ సేవలకు విదేశాంగ కార్యాలయాలు ఇకనెంత మాత్రమూ ఆర్థిక సహాయం అందించవు. అంతర్జాతీయ అభివృద్ధి మంత్రిత్వశాఖ–చైనా, రష్యాలకు అందించే నిధులను నిలిపివేసింది. (భారతదేశం తనంతతానుగానే ఈ నిధులను తీసుకోవటాన్ని ఆపివేసింది) పోలీసు శాఖ తన ఖర్చులో నాలుగు శాతం కోత విధించింది. 2020 నాటికి పెన్షన్ వయసును 66 సంవత్సరాల నుండి 65 సం॥లకు కుదించే దానికి ప్రతిపాదించింది. పాక్షిక స్వయం ప్రతిపత్తి గలిగిన రెండువందల ప్రభుత్వేతర సంస్థలను రద్దు చేసేందుకు ప్రతిపాదించింది. రక్షణశాఖ తన ఖర్చులో 8 శాతం కోత విధించింది. బ్రిటన్ మహారాణికి కూడా ఈ విషయంలో మినహాయింపులేదు. ఈ కోతలు 1980లలో థాకర్‌పాలన నాటి చేదు జ్ఞాపకాలను పునరావృతం చేస్తుండంతో పాటుగా రెండవ ప్రపంచ యుద్ధంతర్వాత కాలంలో అతిపెద్ద కోతలుగా పరిగణింపబడుతున్నాయి.

బ్రిటన్‌లో నేడున్న టోరీ పార్టీ ప్రభుత్వానికి ఒక ఆదర్శనీయంగా నిలిచిన థాచర్, ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ పాత్ర పట్ల తీవ్ర విముఖతను ప్రదర్శించేవారు. టోరీలకు. తమ చర్యలను సమర్థించుకునేందుకు తమవైన సిద్ధాంతాలు వున్నాయి. ప్రస్తుత ప్రధాని కామరూన్ 'విశాల సమాజం' అనే ఆలోచనకు సంబంధించిన ప్రచారాన్ని ప్రారంభించాడు. 'ప్రజా అధికారం' 'స్థానిక సంస్థల సాధికారికత' అనటం మొదలుపెట్టాడు. దీని అర్థమేమంటే, తమతమ స్వీయ నిధుల నుండే పనులను గడుపుకోవాలనీ, వాటి నిర్వహణకు సంబంధించిన అంశాలతో ఉన్నత స్థాయిలోని ప్రభుత్వానికి ఏమీ బాధ్యతను వుంచరాదనేది మాత్రమే! ప్రజా సేవలకోసం ప్రభుత్వంపై ఆధారపడటాన్ని మానుకోవాలనీ, అతికొద్ది ప్రభుత్వ సహకారంతోటే వాటిని నడుపుకోవలసిందిగానూ ప్రజలకు ఆయన సలహాలిస్తున్నారు. పొదుపు చర్యలు చేపట్టిన ఈ కాలం సరిగ్గా ప్రజల సమస్యల పరిష్కారానికి గ్రామాల వైపు చూసేందుకు సరైన సమయంగా చెబుతున్నాడు. ఇవన్నీ పైకి డాంబికంగా చెప్పే మాటలు మాత్రమే. కానీ వాస్తవంలో ప్రజలకు కావలసిన కనీస సౌకర్యాలను కల్పించే బాధ్యత నుండి ప్రభుత్వం తప్పించుకునేందుకు పెద్ద రహదారిని నిర్మిస్తున్నాడు. 'సాధికారత' 'స్వచ్ఛందం' తదితర పడికట్టు పదాలన్నీ ప్రజల పట్ల తమ బాధ్యతల నుండి పారిపోయేందుకూ, వారిని మరింతగా దోపిడీ వర్గాల కోరలకు ఎరజేసేందుకూ దోపిడీ పాలకులు ప్రయోగిస్తున్నారు.

ఈ 'కోత'లన్నీ తమ దుష్ప్రభావాల్ని ప్రజలపై ఇప్పటికే చూపాయి. వారు తమ ఆదాయాలను తీవ్రస్థాయిలో కోల్పోయారు. జీవన వ్యయం పెరిగి పోయింది. ఉద్యోగాల నుండి గెంటి వేయబడు తున్నారు. గృహసౌకర్యాల విషయంలో చేపట్టే కోతలు బ్రిటన్‌లో 'కోసావోతరహా ప్రక్షాళన'కు దారి తీస్తుందేమోనని చాలామంది భయపడుతున్నారు. ఎక్కువ సంఖ్యలో ప్రజలు పెద్ద, పెద్ద నగరాలను వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళేందుకు నెట్టబడుతున్నారు.

ఇప్పటికే ప్రజలు నిరసనలబాటలో ఉన్నారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు సమరశీలంగా స్పందించటం మరింత ప్రాధాన్యతకల విషయం. ఉన్నత విద్య నిధులలో కోతల విధింపు, ట్యూషన్ ఫీజు పెంపుదల ప్రతిపాదనలు విద్యార్థులను వీధులలోకి వచ్చేట్లు చేశాయి. 2010 నవంబరు 11న షుమారు 50 వేల మంది విద్యార్థులు దీనిలో పాల్గొన్నారు.

ఆనాటి ప్రధాని థాచర్ ప్రజలపై 'పోల్ పన్ను' పేరిట విధించిన దానికి వ్యతిరేకంగా, ఆ ప్రభుత్వాన్ని దించివేయటానికి కారణమైన ఆందోళనల తర్వాత ఈ తరహా ఆందోళనలు సాగలేదు.

విద్యార్థి ఆందోళనాకారులు లండన్‌లోని కన్‌సర్వేటివ్ పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడిచేశారు. 2010 నవంబర్ 24న తిరిగి రెండవ పర్యాయం లండన్‌లోని పోలీసులతో ఘర్షణలకు దిగారు. ప్రభుత్వ కార్యాలయాలన్నీ కేంద్రీకృతమై వుండే వైట్ హాల్ ప్రాంతంలోని పోలీసుల వలయాన్ని ఛేదించటానికి చేసే ప్రయత్నంలో భాగంగా ఆందోళనకారులు కొయ్య దుంగల్ని, సీసాలను, రాళ్ళను విసరటం తదితర తీవ్రమైన చర్యలకు పూనుకున్నారు. పార్లమెంటు రహదారిలో డౌనింగ్ స్ట్రీట్ వద్ద విద్యార్థులు మంటల బాంబుల్ని విసిరారు. లిబరల్ డెమోక్రాటిక్ నాయకుడు, ఉప ప్రధాని నిక్ క్లెగ్ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఇతను తన ఎన్నికల ప్రచారం సందర్భంలో ట్యూషన్ ఫీజును వ్యతిరేకించి, ఇప్పుడు దానికి పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నందుకు విద్యార్థులు ఈ నిరసనకు పాల్పడ్డారు.'1968 నిరసనల స్ఫూర్తి'ని నింపుతూ విద్యార్థి కార్యకర్తలు మున్నెన్నటికంటే తీవ్రమైన విద్యార్థి ఉద్యమ వెల్లువ ముంచెత్తబోతుందని హెచ్చరిస్తున్నారు.

విద్యార్థులు విశ్వవిద్యాలయాలను 'ఆక్రమించి', దేశంలోని వివిధ ప్రాంతాలలో బైఠాయింపు కార్యక్రమాలను చేపట్టారు. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ వంటి ప్రముఖ బ్రిటన్ విశ్వవిద్యాలయాలతో సహా అనేక విశ్వవిద్యాలయాలలో విద్యార్థుల నిరసనలు, ప్రదర్శనలు చోటుచేసుకున్నాయి. ఒక విద్యార్థి సంఘానికి చెందిన నాయకులు విద్యార్థుల నిరసనలకు అభ్యంతరం తెలుపగా, ఇతర విద్యార్థి సంఘాలు, విద్యార్థులు 'విద్యార్థులకు నిరసన తెలిపే హక్కు' వుందనీ; సహాయ నిరాకరణ చేసేందుకు, లెక్చరర్‌హాల్స్‌ను తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకూ విద్యార్థులకు హక్కు వుందనీ తెలిపారు. మరిన్ని ధర్నాలు, అందోళనలే గాక ఫ్రెంచ్ తరహా 'ప్రత్యక్ష చర్యలే' వుంటాయని వారు హెచ్చరించారు. విశ్వవిద్యాలయాలన్నీ నిధుల లేమితో శుష్కించిపోతున్న ప్రస్తుత దశలో ఉన్నత విద్యారంగంలో 2.9 బిలియన్ డాలర్ల కోతను వ్యతిరేకిస్తున్న అధ్యాపకులందరూ విద్యార్థుల నిరసనకార్యక్రమాలకు మద్దతుగా నిలిచారు. ఈ విద్యార్థుల ఉద్యమాన్ని–అసంతృప్తుల శీతాకాలపు 'మొదటి తుఫాను'గానూ, ఇటీవలి కాలంలో విద్యార్థులు ప్రదర్శించిన తీవ్రమైన ఆగ్రహంగానూ బ్రిటన్‌లోని పత్రికలు పేర్కొన్నాయి.

కార్మికుల నిరసనలు, పనుల నిలిపివేతలు పెరుగుతున్నాయి. రైలు, సముద్ర, రవాణారంగ యూనియన్‌కు చెందిన 11 వేలమంది కార్మికులు 2010 నవంబరు 3న సమ్మె చేశారు. 800 మంది కార్మికుల తొలగింపును వీరు వ్యతిరేకిస్తున్నారు. 10 ట్యూబ్‌లైన్స్‌లోని సేవలను ఈ సమ్మె ప్రభావితం చేసింది. రాబోయే రోజులలో బ్రిటన్ మరిన్ని తీవ్రమైన కార్మికుల ఆందోళనలు, సమ్మెలను చవిచూడబోతున్న సూచనలు కన్పిస్తున్నాయి.

బ్రిటన్ ప్రభుత్వం తాను చేపట్టిన చర్యల నుండి వెనక్కు వచ్చేసూచన కన్పించటంలేదు. తాము చేపట్టిన చర్యల కారణంగా ప్రజలలో ఆగ్రహం పెల్లుబుకటం సహజమని. తాము ఈ నిరసనలను, ఆందోళనలను అధిగమించగలుగుతామని పేర్కొంటూ 1990 నాటి ఆందోళనలతో వాటిని పోల్చటం సరికాదని తనకు తాను ధైర్యం చెప్పుకుంటున్నది. యావత్‌యూరప్ ఖండాన్నీ, పెట్టుబడిదారీ ప్రపంచాన్నీ చుట్టుముట్టిన ఆర్థిక మాంద్యంలో బ్రిటన్ సమస్యకూడా అంతర్భాగం. ఫ్రాన్స్, గ్రీస్, ఇటలీ. జర్మనీ, వంటి యూరప్‌ఖండంలోని పెక్కు దేశాలు, ఇంకా అమెరికా వంటి దేశాలు పొదుపు చర్యలను చేపట్టటంలో భాగంగా ఏ విధంగా ఆర్థిక భారాలను, కోతలను విధించాయో; ఈ చర్యల ఫలితంగా ఏర్పడిన దుష్ఫలితాలు ఏ విధంగా ప్రజలను పెద్ద ఎత్తున వీధిల్లోకి తీసుకొచ్చాయో మనం చూశాం. దోపిడీ పాలకులు ఈ సమస్యలకు గల మూలకారణాన్ని తాము అమలు చేస్తున్న విధానాలలో చూడకుండా, ఈ సంక్షోభభారాలన్నింటిని ప్రజలపై రుద్ది తాత్కాలిక ఉపశమనం పొందాలనుకుంటున్నారు. ఇప్పటికే సమస్యలతో సతమతమయ్యే ప్రజానీకం కొత్తగా మోపుతున్న మరిన్ని భారాల్ని మోసేందుకు సహజంగానే సిద్ధంగాలేరు. వారు అనివార్యంగా పోరాట బాట నెంచుకున్నారు. దోపిడీపాలకులు తీవ్రంచేసిన ఊచకోతల నుండి తమ హక్కుల రక్షణకోసం, జీవితాల రక్షణకోసం సాగిస్తున్న పోరాటాలన్నీ అవసరమైనవి, న్యాయమైనవీ, అందరూ సంఘీభావం అందించవలసినవీకూడా! అదే సమయంలో సరైన నాయకత్వపు లోపం కారణంగా ఈ నిరసనాందోళలు గమ్యంచేరకుండా మార్గమధ్యంలో నిలిపివేయబడటమో లేక అదే పాలక వర్గాలలోని మరొక సెక్షనుకు ఉపయోగపడటమో జరిగే అవకాశముంది. కావున ఈ నిరసనాందోళనలు ఐక్యతా దిశలో మరిన్ని శక్తులను కూడగట్టుకుంటూ ఈ దోపిడీ వ్యవస్థను అంతంజేసి సోషలిజం వైపుగా ముందుకు సాగాలి. ప్రజలకు అవసరమైన నాయకత్వాన్ని అందించగలిగిన కార్మిక వర్గపార్టీ యొక్క అవసరాన్ని ఇది తెలియజేస్తున్నది.

S

# మహారాష్ట్ర : జైత్‌పూర్ అణువిద్యుత్ కేంద్ర వ్యతిరేక ఆందోళన

**మహారాష్ట్రలోని** కొంకణతీరంలో భారత ప్రభుత్వం 9,900 మెగా వాట్ల సామర్థ్యంతో అణువిద్యుత్ కేంద్ర నిర్మాణాన్ని చేపట్టింది. ఫ్రాన్స్‌కు చెందిన అణుఇంధన కంపెనీ 'అరెవా' (AREVA) భాగస్వామ్యంతో భారత అణువిద్యుత్ సంస్థ (NPCIL) రత్నగిరిజిల్లా జైత్‌పూర్‌వద్ద ఈ ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకుంది.

ఈ అణువిద్యుత్ కర్మాగారం కోసం జైత్‌పూర్ పరిసరాల్లోని 5 గ్రామాలకు చెందిన 960 హెక్టార్ల భూమిని సేకరించారు. సారవంతమైన భూములను కూడా బంజరుగా పేర్కొని భూములను గుంజుకొన్నారు. ఈ అణువిద్యుత్ కేంద్ర ఫలితంగా తమ భూములను, గ్రామాలను వదిలి పెద్ద ఎత్తున రైతులు నిర్వాసితులుగా మారటమేగాక, ఈ పరిశ్రమ నుండి వెలువడే అణుధార్మికత కారణంగానూ; ఏదేని ప్రమాదం జరిగితే దీని ద్వారా సంభవించే తీవ్ర దుష్పరిణామాల కారణంగానూ ఈ అణువిద్యుత్ కేంద్రాన్ని ప్రతిపాదన కాలం నుండీ ప్రజలు తమ వ్యతిరేకతను తెలియజేస్తూ వస్తున్నారు. ప్రభుత్వం ఈ నిరసనలను పెడచెవిన పెడుతూ ఇటీవల ఫ్రాన్స్ అధ్యక్షుని భారత పర్యటన సందర్భంగా చేసుకున్న అణు ఒప్పందాలలో 700 కోట్ల యూరోల వ్యయంతో 'అరెవా' కంపెనీ అణురియాక్టర్లను జైత్‌పూర్‌లో నిర్మించే ఒప్పందం కూడా ఒకటిగా వుంది. జైత్‌పూర్‌లో 'అరెవా' నిర్మించ తలపెట్టిన ఈ అణువిద్యుత్ కర్మాగారం 1986లో రష్యాలో ఘోర ప్రమాదం సంభవించిన నాటి 'చెర్నోబిల్' కర్మాగారం కంటే పదిరెట్లు పెద్దది.

ఈ భారీ అణువిద్యుత్ కేంద్ర ఫలితంగా జైత్‌పూర్ పరిసర గ్రామాలకే కాక, కొంకణ్ ప్రాంతమంతా తీవ్రంగా హాని జరుగుతుందని, తీవ్ర భూకంపాలకు అవకాశమున్న నాలుగోజోన్‌లోని జైత్‌పూర్ ప్రాంతంలో ఈ కేంద్రాన్ని నెలకొల్పబూనుకోవటమే ఘోర తప్పిదమనీ, ఈ విద్యుత్ కేంద్ర దుష్పరిణామాలపై అధ్యయనం చేసిన 'టాటా ఇన్‌స్టిట్యూట్‌ఆఫ్ సోషల్ సైన్సెస్' ప్రకటించింది.

జైత్‌పూర్ ప్రాంతం భూకంపాలకు సంబంధించిన మూడోజోన్‌లో వుంది తప్ప నాలుగోజోన్‌లో కాదనీ; అణువిద్యుత్ కర్మాగారానికి 5 కి॥మీ పరిధిలో భూకంప సంభవ ప్రాంతాలు ఉండకూడదని మాత్రమే అణుఇంధన బోర్డు నిర్దేశిస్తున్నదనీ, కాగా జైత్‌పూర్ ప్రాంతం భూకంప సంభవ ప్రాంతాలకు 30కి॥మీ దూరంలో వున్నదనీ భారత ప్రభుత్వ అణుఇంధన సంస్థ (NPCIL) బూకరిస్తున్నది.

ప్రజల ఆందోళనలు, వివిధ ప్రైవేటు సర్వేలద్వారానే గాక, మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పరిశీలనా బృందం చేసిన నిజనిర్ధారణ నివేదికలో కూడా అణువిద్యుత్ కేంద్ర పర్యవసానాలపై పలు అనుమానాలను వ్యక్తంచేశారు.

ఈ అభిప్రాయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటున్నామంటూనే కేంద్ర ప్రభుత్వ పర్యావరణ మంత్రిత్వశాఖ 35 షరతులు పెడుతూ యాజమాన్యం చేపట్టవలసిన చర్యలను సూచిస్తూ పర్యావరణ అనుమతి నిచ్చింది. ఈ షరతులలో ఏ ఒక్కదానినీ అమలు చేయకుండానే పరిశ్రమ యాజమాన్యం సేకరించిన మొత్తం స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించే పనిని చేపట్టింది.

ఫ్రాన్స్ అధ్యక్షుడు సార్కోజీ భారత పర్యటనను పురస్కరించుకొని ఆందోళనలు తలెత్తకుండా ఈ ప్రాంతంలో ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రయోగించి ముందుగానే అనేకమందిని ప్రభుత్వం అరెస్ట్ చేసింది.

పర్యావరణంపై, ప్రజారోగ్యంపై ఈ అణుకర్మాగారం కల్గించే దుష్ఫలితాలను ఎత్తిచూపుతూ 'కొంకణ్ బచావో సమితి' వంటి పౌరసమాజ వ్యవస్థలు, వివిధ ప్రతిపక్ష పార్టీలు నిరసనలు చేపట్టాయి. కేంద్ర పర్యావరణ మంత్రి జైరాం రమేష్ దీనినంతా రాజకీయ ప్రేరేపితమైన ఆందోళనలుగా కొట్టివేస్తూ అసలు వాస్తవాలను మరుగు పరచ జూస్తున్నాడు.

కేంద్ర మంత్రి ప్రకటనలను తిప్పికొడుతూ, అణువిద్యుత్ కేంద్ర నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ, 2010 డిసెంబరు మొదటివారంలో జైత్‌పూర్ ప్రాంతంలో పెద్దస్థాయిలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. స్థానిక ప్రజలు, రైతులు, వివిధ ట్రేడ్ యూనియన్లు, మత్స్యకారుల సంఘాలు, మహిళా సంఘాలు, పర్యావరణ బృందాలతో కూడిన 'కొంకణ్ బచావో సమితి', 'కొంకణ్ వినాశ్‌కారి వికల్ప్ విరోధి సమితి'ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. దాదాపు 30 వేలమంది ప్రజలు దీనిలో పాల్గొన్నారు. ఈ నిరసనలను అణచివేయటం కోసమని సాయుధులైన 250 మంది పోలీసులను ప్రభుత్వం మోహరించింది. దీనిని ఖాతరు చేయకుండా ప్రజలు శాంతియుత నిరసనను చేపట్టారు. అయినా పోలీసులు అరెస్ట్‌లకు సిద్ధమై నాలుగు బస్సులను ఇందుకోసం ఏర్పాటు చేశారు. అయితే 3 వేల మంది ఆందోళనాకారులు స్వచ్ఛందంగా అరెస్ట్ కావటానికి ముందుకు వచ్చి, అరెస్టు అవటంతో పోలీసులకు వారిని తరలించేందుకు దిక్కుతోచలేదు.

ఇంతటి నిరసనలు, ఆందోళనల తర్వాత, ఇప్పుడు ఈ అణువిద్యుత్ కేంద్రానికి సంబంధించిన అంశాలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి పృధ్వీరాజ్ చౌహాన్ నేతృత్వంలో విద్యుత్‌కేంద్ర నిర్మాణ స్థలంలో బహిరంగ సమావేశం ఏర్పాటు చేయబోతున్నట్లుగా ప్రకటించారు. ఈ సమావేశ ప్రతిపాదనను నిరసిస్తూ జనవరి 10, 11 తేదీలలో రత్నగిరి జిల్లాలోని అణువిద్యుత్ కేంద్ర నిర్మాణ ప్రాంతాలన్నింటా విద్యా సంస్థలను మూసివేశారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన జనవరి 18న జరిగే బహిరంగ సమావేశంలో కొందరు అణుశాస్త్ర వేత్తలను, పాలక రాజకీయ పార్టీల నేతలను మాట్లాడించటం ద్వారా బూటకపు అభిప్రాయ సేకరణ తంతుకు ప్రభుత్వం పూనుకుంది. ప్రజలు ఈ సమా వేశంలో గట్టి ప్రతిఘటనను తెల్పేందుకు సిద్ధంగా వుండటంతో పాటుగా రానున్న రిపబ్లిక్ దినోత్సవాలను కూడా బహిష్కరించేందుకు సిద్ధమయ్యారు.

జైత్‌పూర్ అణువిద్యుత్ కర్మాగారాన్ని నిర్మించ తలపెట్టిన ఫ్రెంచ్ కంపెనీ 'అరెవా'–ఫ్లామన్‌లిల్లీ(ఫ్రాన్స్), ఒల్కిలఏటో (ఫిన్లాండ్)ల వద్ద అణువిద్యుత్ కేంద్రాలను నిర్మిస్తోంది. ఈ రెండుచోట్లా పెరిగిన ఖర్చులను కూడా లెక్కలోకి తీసుకుంటే ఒక్కో అణు రియాక్టర్ నిర్మాణానికి అంచనా వ్యయం 700 కోట్ల యూరోలు (35,000 కోట్లు రూ॥) వుంది. ఈ కేంద్రాల ద్వారా అణు విద్యుదుత్పాదనకు ఒక్కో మెగావాట్‌కు 10 కోట్లు రూ॥ ఖర్చవుతుంది. ఒక్కో యూనిట్‌కు 8 రూ॥ నుండి 10 రూ॥ వరకు ఉత్పత్తి ఖర్చు అవుతుంది.

ఈవిధంగా విద్యుదుత్పాదనకు వున్న ప్రత్యామ్నాయాలన్నింటినీ ప్రక్కనపెట్టి విదేశీ సామ్రాజ్యవాదుల ముందు సాగిలబడుతూ సాగిస్తున్న అత్యంత ప్రమాదకరమైన, అత్యంత ఖరీదైన అణువిద్యుదుత్పాదనకు వ్యతిరేకంగా మన రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా, రణస్థలం నుండి మహారాష్ట్ర – జైత్‌పూర్ వరకు ప్రజలు సాగిస్తున్న న్యాయమైన పోరాటాలకు 'జనశక్తి' సంఘీభావం ప్రకటిస్తున్నది.

S

# బహిరంగ పని ప్రదేశాలలో లైంగిక వేధింపులు

**మహిళపట్ల** వివక్ష, బహిరంగ ప్రదేశాలలో, పనిప్రదేశాలలో లైంగిక వేధింపులు ప్రపంచ వ్యాప్తంగా ఒక పెనుసవాల్‌గా పరిణమించింది. స్త్రీల హక్కులను రక్షించడం, భద్రతను కల్పించడం కష్టంగా వుంది. శారీరకంగా, మౌఖికంగా మహిళలను లైంగిక వేధింపులకు గురిచేయడం సాంఘిక దురాచారంగా మారుతోంది. పురుషాధిపత్య ప్రపంచంలో పురుష దురహంకారులతో కలిసి పనిచేయడం, శాంతియుతంగా కలిసిమెలగడం అసాధ్యంగా మారుతోంది.

ఆర్థిక సరళీకరణ, సాంస్కృతిక సరళీకరణ, సాంకేతిక అభివృద్ధి సాగుతున్న ఈ 21వ శతాబ్దంలో మహిళలపై వేధింపులు మరింతగా పెరుగుతున్నాయి. ఇ.మెయిల్, సెల్‌ఫోన్, ఎస్.ఎమ్.ఎస్., ఛాట్‌రూమ్స్, ఆన్‌లైన్ మొదలైన ఆధునిక సాంకేతిక ప్రక్రియలతో హైటెక్ వేధింపులు నిత్యకృత్యమయ్యాయి. ఆర్థిక సంక్షోభం, నయాఉదారవాద పెట్టుబడిదారీ ఆర్థిక విధానాల ఫలితంగా వచ్చిన పరిణామాలు, మహిళల పట్ల లైంగిక వేధింపులను దిగ్భ్రమకలిగించే పరిమాణంలో పెంచాయి. ఆర్థిక సంక్షోభం కారణంగా ఎదురైన ఇబ్బందులనుంచి కుటుంబాలను కాపాడుకోవటానికి, మహిళలు ఉద్యోగాలలోనికి రావడం అధికమయింది. ఉద్యోగ కల్పన అనేది లైంగిక వేధింపులకు ఒక సాధనంగా మారింది. జీవనోపాధి కల్పించటం పేరుతో, మగవాళ్ళతో సమాన అవకాశాలు కల్పిస్తామన్న పేరుతో, వాళ్ళకు ఆశలు కల్పిస్తున్నారు. ఆ ఆశలు వినియోగించుకొంటున్నారు. మహిళల శ్రమను దోచుకోవటానికి మాత్రమే కాక వారిని లైంగిక దోపిడీకి, లైంగిక వేధింపులకూ గురిచేయటానికి నయాఉదారవాద ఆర్థిక విధానాలు సృష్టించిన కుట్ర ఇది. స్వేచ్ఛకు స్వర్గంగా భావించే అమెరికాలో ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గణాంకాల ప్రకారం పురుషులకంటే ఐదురెట్లు ఎక్కువ మంది మహిళలు గత 3 సంవత్సరాలలో ఉద్యోగాలు కోల్పోయారు. బ్యాంకుల్లోనూ, ఆర్థిక సంస్థలలోనూ మేనేజర్లుగా పని చేసే పురుషుల వేతనం ఒక డాలరు అయితే అదే ఉద్యోగం చేసే మహిళల వేతనం 2000 సంవత్సరంలో 63.9 సెంట్లు. అది 2007వ సంవత్సరం వచ్చే సరికి 58.8 సెంట్లకు పడిపోయింది. 13 పరిశ్రమలకు సంబంధించి అధికారికంగా చేసిన సర్వే ద్వారా వెల్లడైన గణాంకాలు ఇవి. అమెరికాలో పురుషులతో సమానంగా మహిళా ఉద్యోగులను పరిగణించడం లేదనటానికి ఇది స్పష్టమైన ఉదాహరణ. వేతనాలలోను పదోన్నతులలోను మహిళలు వివక్షకు గురవుతున్నారు, లింగవివక్షకు గురవుతున్నారనే ఫిర్యాదులు అమెరికాలో ఇటీవల బాగా ఎక్కువ అవుతున్నాయి. కెనడాకు చెందిన పెంగ్విన్, హెవిట్ పౌకార్డ్ కంపెనీలకు చెందిన ఇద్దరు సి.ఇ.ఓ.లు మహిళలను వేధిస్తున్నారన్న కారణంతో ఉద్యోగాలనుంచి తొలగించటమనేది–మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు ప్రబల తార్కాణంగా నిలుస్తుంది. 2002లో ఇన్ఫోసిస్ కంపెనీ అమెరికా విభాగానికి అధిపతిగా ఉన్న పనీష్‌మూర్తి, 2010లో కెనడా పెంగ్విన్ కంపెనీకి చెందిన డేవిడ్ డేవిడర్‌ల ఉదంతాలు, కోర్టుబయట ఒప్పందాలను కుదుర్చుకొని వాస్తవాలను బయటకు రాకుండా తొక్కిపెట్టటం, తదుపరి విచారణ సాగకుండా చేయడం అనేవి పురుష దురహంకార ప్రపంచపు స్వభావాన్ని కళ్ళకు కడుతున్నాయి.

లైంగిక వివక్షకు గురవుతున్నానంటూ 'గోల్డ్‌మన్‌శాక్స్' కంపెనీ ఒక ఉద్యోగిని దావా వేసింది. తనను ఒక సహద్యోగి గోడకు అదిమి శరీరమంతా తడిమాడని ఫిర్యాదు చేసింది. మహిళలపై లైంగిక వేధింపులు, అసభ్యపు జోకులు మొదలైనవి కొనసాగే సంస్కృతి మారలేదని ఈ ఉదంతం తెలియజేస్తోంది. సాంకేతికంగా అభివృద్ధి చెందిన ప్రజాస్వామిక ప్రపంచంలోని క్రూరమైన వాస్తవం ఇది! అభివృద్ధి చెందుతున్న దేశాలలో మహిళలకు సంబంధించిన సామాజిక వాస్తవాలు మరింత భయానకంగా, మానవ జాతి సిగ్గుపడే విధంగా ఉన్నాయి.

గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న భారతీయ మహిళా వలస కార్మికులను లైంగిక దోపిడీకి గురిచేస్తున్న అనేక భయానక కథలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. తనను ప్రతిరోజూ 35 మంది బలాత్కారం చేస్తున్నారని ఒక మహిళ ఫిర్యాదు చేసింది. తనను బహిస్టు సమయాలలో కూడా వదిలిపెట్టడంలేదని మరొక మహిళ ఫిర్యాదు చేసింది. తమ కుటుంబాన్ని పోషించుకోవటానికి సరిపడినంత వేతనాన్ని, ఆహారాన్ని ఇస్తే తాము ఈ క్రూరత్వం బారిన పడకుండా రక్షించబడతామని అభ్యర్థించారు. భారత, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంకకు చెందిన మహిళలను ఉద్యోగాల పేరుతో గల్ఫ్ దేశాలకు తీసుకువెళ్ళి ఎంత దుర్మార్గంగా లైంగిక హింసను వీరిపై ప్రయోగిస్తున్నారో అర్థమవుతోంది. ఈ ఆధునిక కాలంలో మహిళలను లైంగికంగా అనుభవించటానికి, లైంగిక వేధింపులకు గురిచేయటానికి ఉద్యోగ కల్పన అనేది శక్తివంతమైన, ఆకర్షణీయమైన ఎరగా ఉపయోగ పడుతున్నది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ తరువాత భారతదేశంలోనూ అదే చేదు అనుభవాలు మరింతగా ఎదురవుతున్నాయి.

లక్షలకొద్దీ మహిళలు హైటెక్, ఐ.టి., బిపిఓ పరిశ్రమలలో; ఎగుమతికి ఉద్దేశించిన సెజ్‌లలోను, ఎగుమతి జోన్లను నిర్మించిన వస్త్ర పరిశ్రమల్లో పని చేస్తున్నారు. ఉద్యోగాలలో లింగ వివక్షకు గురికావటమే గాక పనిప్రదేశాలలో లైంగిక వేధింపులకు కూడా గురవుతున్నారు. ఐ.టి., బిపిఓ పరిశ్రమలలో వేతనాలపెంపు, పదోన్నతులు ఆశచూపటం; వస్త్ర పరిశ్రమలు, సెజ్‌లు మొదలైన వాటిలో ఉద్యోగాలనుండి తొలగిస్తామనే బెదిరింపులతో, మహిళలను వేధింపులకు గురిచేస్తున్నారు. వాటికి లొంగని వారిపై ఎక్కువపని భారంమోపడం, దూషించడం, శారీరకంగా హింసించడం మొదలైన కక్షసాధింపు చర్యలు చేపడ్తున్నారు.

బెంగుళూరు, పూనా, ముంబై, ఢిల్లీ,కలకత్తా, హైదరాబాద్‌లలోని ఐ.టి.,బి.పి.ఓ. పరిశ్రమలలో మహిళా ఉద్యోగుల సమస్యలపై ఇటీవల చేసిన సర్వేలో మహిళలపై లైంగిక వేధింపులలో 40% వారి బాస్‌లే చేస్తున్నారని తేలింది. సేవా రంగ పరిశ్రమలలో పెరిగిన నగర సంస్కృతి, లైంగిక వేధింపులకు ఎక్కువగా కారణమవుతున్నది. ఐ.టి., బి.పి.ఓ. రంగాలలో ఒక స్వచ్ఛందసంస్థ వివిధ దేశాలలో జరిపిన సర్వేలో 600 మంది మహిళా ఉద్యోగులను ప్రశ్నించగా 88% లైంగిక వేధింపులకు గురవుతున్నామని చెప్పారు. అటువంటి సంఘటనలపై ఎలా ఫిర్యాదు చేయాలో అర్థం కావటం లేదని 47% మంది చెప్పారు. లైంగిక దూషణలను, లైంగిక కార్యకలాపాలలో పాల్గొనాలనే వత్తిడులను ఎదుర్కొంటున్నామని 50% మంది చెప్పారు.

అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళలు మరింతగా లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్నారు. అసంఘటితరంగాలలో దినవేతన కూలీలు, కాంట్రాక్టు కార్మికులకు భారతదేశంలో లైంగిక వేధింపులు ప్రధాన సమస్యగా ఉన్నది. భారతదేశంలో చిన్న నగరాలు, పట్టణాలలో సెల్‌ఫోన్లు, ఆన్‌లైన్, టి.వి. మొదలైన పరికరాల ద్వారా టీనేజ్ యువతులను లైంగికంగా వేధించడం ఎక్కువయిందని మరొక సర్వే తెలుపుతోంది. ఈ సమస్య అన్ని రాష్ట్రాలలోను చిన్నపట్టణాలలో మరింత ఎక్కువగా ఉన్నది. సర్వేలో పాల్గొన్న వారిలో 77% బాలికలు వేధింపులకు గురవుతున్నామని చెప్పారు. ఇది టీనేజ్ బాలికలకే పరిమితం కాదు. కేరళ రాజధాని తిరువనంతపురంలో ఒక సర్వే జరిగింది. అక్కడ అక్షరాస్యతాశాతం దేశం మొత్తంమీద అధికంగా ఉన్నది. అక్కడి సర్వేలో వెలువడిన వాస్తవాలు దిగ్భ్రాంతికరంగా ఉన్నాయి. బహిరంగస్థలాలలో లైంగిక వేధింపులు ఎక్కువగా ఉన్నాయని, బహిరంగ ప్రదేశాలలో రక్షణలేదని మహిళలు భావిస్తున్నారు. సర్వే చేసిన ప్రతి 10 మందిలో ఒకరు ఏదో ఒక సమయంలో రక్షణ కొరకు పోలీసుల సహాయం అర్థించినవారే. సిగ్గుపడాల్సిన విషయమేమంటే ప్రతి ఐదుగురు మహిళలలో నలుగురు తాము నివసించే ప్రాంతంలోని మగవాళ్ళపైన నమ్మకంలేదంటున్నారు.

63 సంవత్సరాల మన స్వాతంత్ర్యం కానీ, పురుషులతో సమానంగా మహిళలకు హక్కులున్నాయంటున్న మన రాజ్యాంగం కానీ, వరకట్న వ్యతిరేక చట్టం, గృహహింస చట్టం, మొదలైన శాసనాలుకానీ, మహిళలను పవిత్రంగా చూడాలనే హైందవ సంస్కృతి కానీ మహిళలను రక్షించలేక పోతున్నాయి. వారి హక్కులను కాపాడి వారికి భద్రతను కల్పించలేక పోతున్నాయి.

మహిళలకు 33% రిజర్వేషన్లను కల్పించే బిల్లును ఆమోదించటంలో యు.పి.ఎ. ప్రభుత్వం విఫలమయింది. విశాఖ, రాజస్థాన్‌లలో మహిళలపై సామూహిక అత్యాచార కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన 13 సంవత్సరాల తరువాత కానీ "పనిప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధిపులకు వ్యతిరేకంగా రక్షణ కల్పించే బిల్లు–2010"ని పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్లు గర్వంగా ప్రకటిస్తున్నారు. సరియైన చట్టం లేనందువలననే లైంగిక వేధింపులు జరుగుతున్నాయనీ మహిళా సాధికారత సాధనకు, లింగ వివక్షకు వ్యతిరేకంగా మహిళల హక్కులను కాపాడటానికి ఈ బిల్లు ఉపయోగపడుతుందని ప్రచారం చేస్తున్నారు.

మన పాలకులతో మనకు ఉన్న ఈ అరవై ఏళ్ళ చేదు అనుభవాలను బట్టి ఈ చర్యలు మహిళా రక్షణకు ఏమాత్రమూ చాలవనీ. మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టలేవనీ, మహిళల ఓట్లను దండుకోటానికి ఇది ఒక ఎత్తుగడ మాత్రమేనని అర్థమవుతున్నది.

న్యాయ వ్యవస్థపై భ్రమలను పెంచుతూ, మహిళలను మోసం చేయుటకు ఉద్దేశించి, ఈ బిల్లును తయారు చేశారు. ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ (26–4–2008)లో వ్రాసిన ఒక వ్యాసంలో ప్రభుత్వ సంస్థలలో మహిళలపై వేధింపుల ఫిర్యాదులను తీసుకొని విచారించుటకు ఒక కమిటీ ఏర్పాటు చేశారు, కానీ ఆ కమిటీ సభ్యులకు వారి అధికారాలు, విధులు ఏమిటో తెలియవు. సమాజంలో మహిళపట్ల సరియైన దృక్పథం అలవడనంతకాలమూ ఈ పరిస్థితిలో మార్పురాదు. 10 మంది కంటె ఎక్కువ మహిళా కార్మికులు ఉన్న 41.2 మిలియన్ల సంస్థలలో ఫిర్యాదు కమిటీలు ఏర్పాటు చేయవలసి వుంది. ఫిర్యాదీ చేసిన ఆరోపణ వాస్తవం కాదని తేలితే ఫిర్యాదు చేసిన మహిళపై చర్యతీసుకొనే నిబంధన కూడా వుంది.

అందువలన లైంగిక వేధింపులకు గురైన మహిళలు ఫిర్యాదు చేయుటకు ముందుకు రావటంలేదు. తమ ఉద్యోగాలను కోల్పోతామని, పదిమందిలో వంచనవుతామనీ, కుటుంబ సభ్యుల నుంచి, భర్త నుంచి అవమానాలను ఎదుర్కోవలసి వస్తుందనే భయాలతో ఫిర్యాదు చేయటంలేదు.

మహిళలపై ఈ సాంస్కృతిక, సంప్రదాయ ఒత్తిళ్ళు – అర్థవలస సమాజపు పితృస్వామ్య, సాంఘిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక వ్యవస్థ యొక్క కుహనా ఉదారవాదమూ, పెట్టుబడిదారీ వినియోగతత్వం నుంచి ఉద్భవిస్తున్నాయి.

వ్యవస్థలో కొనసాగుతున్న ఈ చాంధసవాద ధోరణులను సమూలంగా నాశనం చేస్తే తప్ప–అవమానకరమైన లైంగిక వేధింపులను తొలగించి మహిళలకు తగిన గౌరవాన్ని, భద్రతను కల్పించడం; వారి హక్కులను పరిరక్షించటం సాధ్యంకాదు. ఈ పరిస్థితులలో ప్రతిపాదిత బిల్లు మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించటం అనేది, అణగారిన పీడితవర్గాలు దీర్ఘకాలంగా పొందుతున్న అనుభవాలనుండి చూస్తే సందేహాస్పదమే!

నిలకడైన సుదీర్ఘ ప్రజా ఉద్యమం మాత్రమే లింగవివక్షను, లైంగిక దోపిడీని, వేధింపులను, అసమానతలను తొలగించగలదని మన అనుభవం తెలియజేస్తోంది.

ఈ స్పష్టమైన అవగాహనతో సామాజిక చెడుగులను తొలగించటానికి, ప్రతిపాదిత బిల్లును వినియోగించు కోవటానికి ఉన్న అవకాశాలను, సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రగతిశీల శక్తులు ఉద్యమాలను నిర్మించవలసిన అవసరం ఉన్నది. S

# 'పరువు' హత్యలు (హానర్ కిల్లింగ్స్) పేరిట మహిళలపై, దళితులపై అఘాయిత్యాలు, హత్యలు

**దేశ రాజధానీ** నగరం ఢిల్లీతో సహా ఉత్తర భారతదేశంలోని పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో ప్రధానంగా గత కొద్ది సంవత్సరాలుగా 'పరువు' పేరిట సాగించే హత్యలు సర్వసాధారణమై పోయాయి. ఇవి క్రమంగా దేశంలోని వివిధ ప్రాంతాలకు విస్తరించాయి, కొనసాగుతున్నాయి.

పంజాబ్ రాష్ట్రం–కపూర్తల సమీపంలో కైంత్ గ్రామంలో కుమార్తె ప్రేమను అంగీకరించని తల్లిదండ్రులు ఇటీవల ఆమెను కరెంట్ షాక్‌కు గురిచేసి ఘోరంగా హత్య చేశారు. కైంత్ గ్రామానికే చెందిన గుర్జీత్‌కౌర్–గగన్‌దీప్‌లు ప్రేమించుకోవటాన్ని, పెళ్ళి చేసుకోవాలనుకోవటాన్ని అంగీకరించలేని పెద్దలు 'పరువు' పేరిట ఈ హత్యలకు పాల్పడ్డారు. గగన్‌దీప్‌ను కారులోనే బంధించి పెట్రోలుపోసి తగులబెట్టారు. దీని నుండి అతను తప్పించుకొని బయటపడితే ఆయుధాలతో వెంటబడి దాడిచేశారు.

హర్యానా రాష్ట్రంలో వేదపాల్ అనే యువకుడు వేరే ప్రాంతం, వేరే గ్రామానికి చెందిన యువతిని పెళ్ళి చేసుకున్నాడు. పక్క గ్రామంలోని యువతినే వివాహమాడాలన్న నిబంధనను ఉల్లంఘించాడనే కారణంచూపి పోలీసుల ఎదుటే వారిని కొట్టి చంపారు. ఖఫ్‌పంచాయితీల వత్తిడి ఫలితంగా ఎక్కడ తమను వెలివేస్తారోననే భయాందోళనతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులే తమ వారిని హతమారుస్తున్నారు.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం– బిజ్నూర్ జిల్లా, కస్పూరా ప్రాంతంలో మహమ్మద్ తాఫిక్ (32 సం॥) సెల్‌ఫోను షాపు నడుపుకుంటున్నాడు. రోష్ని (20 సం॥లు) తరచుగా సెల్‌ఫోన్ ఛార్జింగ్ కోసం షాపుకు వస్తుండేది. వారు పరస్పరం ప్రేమించుకున్నారని గమనించి, వారిరువురిని నవంబర్ 11న అమ్మాయి తరఫు బంధువులు బంధించి తాఫిక్‌ను కొట్టిచంపారు. దీనిని ప్రతిఘటించిన రోష్నిపై కిరోసిన్ పోసి తగులబెట్టారు. అమె చావు బ్రతుకుల మధ్య ఆస్పత్రిపాలైంది.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆలీపుర్‌లోని డెల్లిగాట్ ప్రాంతంలో యువతీ యువకులిరువురు ప్రేమించి పెళ్ళిచేసుకొని పెద్దల అంగీకారంలేదనే భయంతో పారిపోయారు. వీరి కుటుంబపెద్దలు కొద్ది రోజుల ప్రయత్నంలో ఆ దంపతుల ఆచూకీ కనుగొని, వారి ప్రేమను అంగీకరించామని, తిరిగి రమ్మని కోరడంతో నమ్మి అమాయకంగా తిరిగివచ్చిన వారిని అమ్మాయి అన్నయ్య మహమ్మద్ తుపాకీతో నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపాడు.

వేర్వేరు కులాల్లో పుట్టి ప్రేమించి పెళ్ళి చేసుకున్నందుకు కులదీప్, మోనికాలను; వాళ్ళ పెళ్ళికి సహకరించిన బంధువర్గంలోని మరో జంటను వారి, వారి కుటుంబ సభ్యులే చంపేశారు. కులదీప్ కారులోనే తూటాదెబ్బలకు బలికాగా, మోనిక ఇంట్లోనే బాత్‌రూమ్‌లో సొంత అన్న చేతిలో హత్యకు గురైంది.

'ఖఫ్' పంచాయితీల పేరిట అగ్రకుల పెత్తందార్లు నిర్మాణయుతంగా సాగిస్తున్న దాడి ఇది! మహిళలకు ప్రవేశంలేని పంచాయితీలలో చేసిన ఈ నిర్ణయాలను ఆయా గ్రామాల ప్రజలందరూ రాజ్యాంగం కంటే పవిత్రంగా, చట్టాలకంటే గౌరవంగా అమలు జరిపి తీరాలి. ఫ్యూడల్, పితృస్వామ్యం కరడుకట్టిన ఈ 'పంచాయితీలు' ముఖ్యంగా యువతీయువకులు ప్రేమించి వివాహాలు చేసుకోవటాన్ని నిషిద్ధం చేస్తున్నాయి. సగోత్రీకులు వివాహాలు చేసుకుంటున్నారనో, ఒకే గ్రామంవారు వివాహం చేసుకుంటున్నారనే పేరిటనో యువతీ యువకులపై దాడులకు పాల్పడుతున్నారు. వారిని నిలువునా చంపి పాతరేసే అనాగరిక, పైశాచిక స్థితికి స్వయానా కని, పెంచిన తల్లిదండ్రులనే ప్రేరేపిస్తున్నారు. కులగౌరవం, వంశ ప్రతిష్టల పేరిట ఫ్యూడల్ భావజాలాన్ని తలకెక్కించుకున్న వీరు–తాము సాగిస్తున్న ఈ హత్యలను 'పరువు' హత్యలుగా గౌరవనీయంగా భావిస్తున్నారు. సగోత్రీకులుగా వుండి, సోదరీ సోదరులుగావున్నవారి మధ్య వివాహ సంబంధాలు నిషిద్ధం కనుక తదనుగుణంగా హిందూ వివాహ చట్టంలో సవరణలు చేయాలని 'ఖఫ్' పంచాయితీలు డిమాండ్ చేస్తున్నాయి. కానీ ఆచరణలో వీరు – సగోత్రీకులేకాదు వేరు వేరు గోత్రాల వారైనా, వేరువేరు కులాల వారైనా ప్రేమించి పెళ్ళిళ్ళు చేసుకోడాన్ని హత్యలు చేసైనా సరే కట్టడి చేయాలనే నిర్ణయంతో వ్యవహరిస్తున్నారు.

చట్టాన్ని పరిరక్షిస్తామని, రాజ్యాంగాన్ని గౌరవిస్తామని ప్రమాణాలుచేసి అధికారంలోకి వస్తున్న ప్రభుత్వాలు, పాలక పార్టీలన్నీ గ్రామీణ ప్రాంతాల్లోని ఈ ఫ్యూడల్ అగ్రకులాధిపత్య వర్గాలతో తమ ఓట్ల, సీట్ల (ఎన్నికల) రాజకీయ ప్రయోజనాల కనుగుణంగా వ్యవహరిస్తూ మధ్యయుగాలనాటి ఉన్మాద చర్యలను మౌనంగా సమర్థిస్తున్నాయి లేదా బహిరంగంగా కీర్తిస్తున్నాయి. **(చూడండి 5–7–2010 జనశక్తి)**

ఖఫ్ పంచాయితీల ప్రభావం ఎక్కువగా వున్నచోటే కులదురహంకార హత్యలు జరుగుతున్నాయి. సగోత్రీకుల మధ్య వివాహాల కంటే ఈ హత్యలు ప్రధానంగా కులాంతర వివాహాల కారణంగానే జరుగుతున్నాయని జాతీయ మహిళా కమీషన్ మరియు 'శక్తివాహిని' అనే స్వచ్ఛంద సంస్థల అధ్యయనం వెల్లడించారు. **అగ్రవర్ణాలవారు**

**(తరువాయి 7వ పేజీలో)**

# రైతాంగాన్ని నిలువుదోపిడీ చేస్తున్న నాసిరకం విత్తన-పురుగుమందు కంపెనీలు

**పైరు** పెరుగుదలకు, పంట దిగుబడులకు నాణ్యమైన విత్తనాలు కావాలి. ఇలాంటి విత్తనాల వలన రైతాంగం సగం ఊరట చెందుతుంది. నాసిరకం విత్తనాలవల్ల సేద్యం సమస్యలతో ప్రారంభమౌతుంది. నాణ్యమైన విత్తనాలు రైతాంగానికి అందకపోవటమే కాకుండా, మార్కెట్‌ను నాసిరకం విత్తనాలు ముంచెత్తటంతో రైతాంగానికి తీవ్రనష్టం వాటిల్లుతున్నది.

1965 దాకా రాష్ట్రంలోనూ, దేశంలోనూ రైతాంగం దేశవాళీ సాంప్రదాయ సేద్యం చేశారు. తాము పండించిన పంట నుండే తిరిగి విత్తనాలు కట్టుకొనేవారు. ఫలితంగా విత్తన కొనుగోలు ఉండేదికాదు. మన వాతావరణానికి అనుగుణమైన విత్తనాల వలన చాలావరకు చీడపీడలు నివారించబడ్డాయి. పశువుల, కంపోస్టు ఎరువుల వాడకం వలన ఎరువుల ఖర్చుకూడా నామమాత్రంగా ఉండేది. రెండవ పంటగా మినుము, పెసర, పిల్లిపెసర, శనగలాంటి పంటలు వేయటంవలన ఆ మొక్కల మొదళ్ళ బుడిపెల ద్వారా భూమికి నత్రజని లభించి భూమి సారవంతమయ్యేది.

అధిక దిగుబడులు, స్వయంసమృద్ధి పేరుతో 1966లో హరిత విప్లవం ప్రారంభమై, సాంప్రదాయ సేద్యానికి తిలోదకాలు యిచ్చే చర్యలు ప్రారంభమైనాయి. దేశీయ విత్తనాలవలన దిగుబడులు రావనీ, విదేశీ కంపెనీల ప్రచారంతో, విదేశీ హైబ్రీడ్ విత్తనాలవైపు ఆకర్షింపజేశారు. అన్ని పంటలకూ రైతాంగం కంపెనీల విత్తనాలే కొనుగోలు చేశారు. వీటికితోడు బహుళజాతి కంపెనీలు ఉత్పత్తిచేసిన జన్యుమార్పిడి విత్తనాలు (బి.టి.) ప్రవేశించటంతో సాంప్రదాయ విత్తనాలు పూర్తిగా కనుమరుగయ్యాయి. ఫలితంగా విత్తన వ్యాపారం దేశంలో మూడుపువ్వులు, ఆరుకాయలుగా సాగుతున్నది. తాజా సమాచారం ప్రకారం దేశంలో సంవత్సరానికి 7వేల కోట్ల రూపాయల విత్తన వ్యాపారం జరుగుతుండగా, రాష్ట్రంలో 1500 కోట్ల వ్యాపారం విత్తన కంపెనీలు చేస్తున్నాయి.

పెద్దఎత్తున విత్తన వ్యాపారం విస్తరించటంతో, విత్తన కంపెనీలు రకరకాల బ్రాండ్లతో ఏమాత్రం ప్రమాణంలేని విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. ఇలాంటి నాణ్యతలేని విత్తనాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. వీటిని కొనుగోలు చేసిన రైతాంగం తీవ్రంగా నష్ట పోయారు, పోతున్నారు. విత్తన వ్యాపారులు కోట్లాది రూపాయల లాభాలు గడిస్తున్నారు.

ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకొనే విత్తనాలు, మన వాతావరణానికి సరిపోతాయా లేదా, అవి నాణ్యమైనవా కాదా, దిగుబడులు ఎలా ఉంటాయి, వాటినుండి సంక్రమించే తెగుళ్ళు ఎలాంటివి అన్న విషయాలను మన శాస్త్రవేత్తలు పరిశీలించిన తర్వాతనే వాటిని అనుమతించాలా! వద్దా అన్న దాన్ని నిర్థారించవలసిఉంటుంది. ఈ పరీక్షలు చేయటానికి రంగారెడ్డిజిల్లా రాజేంద్రనగర్‌లోనూ, కర్నూలుజిల్లా ఎమ్మిగనూరులోనూ,పశ్చిమగోదావరిజిల్లా తాడేపల్లిగూడెం లోనూ పరీక్షా కేంద్రాలు ఉన్నాయి.

హైద్రాబాదులోని మలక్‌పేటలో అత్యంతాధునిక డి.ఎన్.ఏ., ఫింగర్ ప్రింట్స్ అండ్ ట్రాన్స్‌జెనిక్ మానిటరీ కేంద్రం ఉంది. ఇంత మెరుగైన కేంద్రం దేశంలో మరెక్కడా లేదు. ఈ టెక్నాలజీని ఉపయోగించుకొని రైతాంగానికి మేలురకమైన విత్తనాలను అందించవచ్చు. పాలక ప్రభుత్వాలు అలాంటి అవకాశాలను శాస్త్రవేత్తలకు కల్పించకపోవటంవలన ఈ పరిశోధనా కేంద్రాలు రైతాంగానికి ఉపయోగపడటంలేదు.

పరిశోధనాకేంద్రాల అన్నింటిలోనూ వరి, మొక్కజొన్న, ప్రొద్దు తిరుగుడు, పత్తి, మిరప విత్తనాలకు సంబంధించి ప్రతిసంవత్సరం 10వేల శాంపిల్స్ పరీక్షించబడుతున్నాయి. రాష్ట్రంలో సరఫరా చేసే మొత్తం విత్తనాల్లో ఇవి ఐదుశాతం మాత్రమే. 95% విత్తనాలు ఎటువంటి పరిశోధనలు లేకుండానే మార్కెట్‌కి చేరుతున్నాయి. ఏ విత్తనమైనా 80% మొలకెత్తితేనే నాణ్యమైన విత్తనాలుగా గుర్తించాల్సివుంటుంది. మార్కెట్‌కి విత్తనాలు సరఫరా కాకముందే శాంపిల్స్‌ను పరీక్షించాల్సివుంది. విత్తనాలు మంచివి కాదని రైతుల నుండి ఫిర్యాదు వచ్చినప్పుడు కూడా, పంటల ఆధారంగా పరీక్షలు జరుపుతూఉండాలి. వాడిన విత్తనాలవలన పూత, కాయలు సరిగా లేదని రైతులు ఫిర్యాదు చేస్తే, ఆ పంట మొక్కలకు సంబంధించిన ఆకుల శాంపిల్స్ సేకరించి, పరీక్షా కేంద్రాలకు పంపాలి. ఇలాంటప్పుడు పరీక్షా కేంద్రాలను, విత్తన కంపెనీలు ప్రలోభపెట్టి అన్నిరకాలుగా మంచిగా ఉన్నాయనే సర్టిఫికేట్ పొందుతున్నారు.

ఖరీఫ్, రబీ సీజన్లో మార్కెట్‌లోకి విడుదల చేసే విత్తనాలకు ఆ విత్తన కంపెనీలు వ్యవసాయశాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. అలా తీసుకోకుండానే, కంపెనీ విత్తనాలను నాణ్యమైనవిగా ధృవీకరణ పత్రాలు సమర్పించటం చూస్తే, వ్యవసాయశాఖ, కంపెనీలకు దాసోహమంటున్న తీరుకు అద్దంపడుతున్నది. మార్కెట్‌లోకి విడుదల చేసే ముందుగా విత్తనాలకు 30 రోజుల్లో నాణ్యతా ప్రక్రియను పూర్తి చేయాల్సివుండగా, వాటి పరీక్షా ఫలితాలు రాకుండానే వాటిని రైతాంగానికి అంట గడుతున్నారు. నామమాత్రంగా పరీక్ష చేసిన విత్తనాల్లో కూడా నాసిరకం విత్తనాలు ఎక్కువగానే బయట పడుతున్నాయి. 2008 నుండి 2011 వరకు పరీక్షించిన విత్తనాలు, వాటిల్లో నాసిరకంగా తేలినవి ఈ విధంగా వున్నాయి.

| సంవత్సరం | పరీక్షించిన శాంపిల్స్ | నాసిరకం |
|---|---|---|
| 2008-09 | 10,352 | 93 |
| 2009-10 | 11,488 | 279 |
| 2010-2011 (ఖరీఫ్ వరకు) | 8,287 | 154 |

దీన్ని గమనిస్తే పరీక్షించిన వాటిలో వందల కొద్దీ విత్తనరకాలు నకిలీవిగా తేలాయి. నాసిరకం విత్తనాలను అరికట్టే ఉద్దేశంతో 1966లో తెచ్చిన విత్తన చట్టం, దానికి చేసిన సవరణలు, నకిలీ విత్తనాలను అరికట్టలేకపోయాయి. ఆ చట్టంలో ఎటువంటి కఠిన నిబంధనలూలేవు. నామమాత్రమైన జరిమానాలు, శిక్షలతో సరిపెట్టడంవలన నాసిరకం విత్తన వ్యాపారులు తమ వ్యాపారాన్ని సులువుగా మార్కెట్‌లో విస్తరింపచేశారు. ఉన్న చట్టాన్ని కూడా పాలక ప్రభుత్వం సక్రమంగా అమలు జరపకుండా నకిలీ వ్యాపారుల ప్రయోజనాలను కాపాడుతున్నది. నాసిరకం విత్తనాల వలన రైతాంగం తీవ్రంగా నష్టపోవటంతో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైయింది. వాటిని అరికట్టలేకపోవటం వలన ప్రభుత్వం తీవ్ర విమర్శలకు గురైంది. రైతాంగం వ్యతిరేకతను మళ్ళించటం కోసం, ప్రస్తుత చట్టం ద్వారా నాసిరకం వ్యాపారులను కఠినంగా శిక్షించే వీలు లేదని, అందుకు కొత్త చట్టం తీసుకొస్తామని చెప్పి 2004లో కొత్త చట్ట ముసాయిదాను విడుదల చేసి, 2006లో శాసనసభలో ప్రవేశపెట్టటంతో, అది ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ఈ విధంగా ఆమోదం పొందిన చట్టం కేంద్ర ప్రభుత్వం వద్ద చలన రహితంగా పడివుంది. దేశ వ్యాపితంగా నాసిరకం విత్తనాలకు బహుళజాతి సంస్థలకు ముఖ్యంగా మోన్‌శాంటోకి వ్యతిరేకంగా రైతాంగం దాడులకు దిగారు. రైతాంగపు ఆందోళనల నేపథ్యంలో 2004 ముసాయిదా బిల్లు ఆధారంగా కొత్త విత్తన బిల్లును తయారుచేసి, దాన్ని పార్లమెంటు స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపింది. ఈ బిల్లు బహుళజాతి విత్తన కంపెనీల ప్రయోజనాలకు అద్దంపట్టింది. ముఖ్యంగా విత్తన ధృవీకరణ సర్టిఫికెట్లను బహుళజాతి కంపెనీలు ఇచ్చే అవకాశం కల్పించటమే కాకుండా, విదేశాల నుండి కూడా కంపెనీ ధృవీకరణ పత్రాలు పంపవచ్చునని ముసాయిదా బిల్లులో పేర్కొనటం, బహుళజాతి సంస్థల విత్తనాలు, బి.టి. విత్తనాలు విచ్చలవిడిగా భారతదేశంలో అమ్ముకోవటానికి పూర్తి స్వేచ్ఛను కల్పించింది. జరిమానాలు, శిక్షాకాలన్ని నామమాత్రంగా చేశారు

బహుళజాతి విత్తన సంస్థలకు ఈ నిబంధనలు లెక్కలోకే రావు. ఈ సంస్థలు న్యాయస్థానాలనే ప్రభావితం చేయగలిగిన స్థితిలో ఉన్నాయి. అందువలన పార్లమెంటులో ప్రవేశపెట్టబోతున్న కొత్త విత్తన చట్టం ముసాయిదా బిల్లు రైతాంగ ప్రయోజనాలను బలిపెట్టేది తప్ప రక్షించేది కాదు.

నాసిరకం విత్తనాలవలన రైతులు పంట నష్టపోయినప్పుడు, ఆ విత్తనాలు విక్రయించిన సంస్థలు, రైతాంగానికి పరిహారం చెల్లించాలి. అనేకమంది రైతులు పరిహారంకోసం వ్యవసాయ కమీషనరేట్‌లో ధరఖాస్తులు పెట్టుకున్నారు. మోన్‌శాంటో, దాని అనుబంధసంస్థ మహికో మరియు ఇతర సంస్థలు, నాసిరకం విత్తనాలు సరఫరా చేసినందుకు ఎంత పరిహారం చెల్లించాల్సిందీ పూనం మాలకొండయ్య కమీషన్ తీర్పు యిచ్చినప్పటికీ పరిహారం చెల్లించటానికి మోన్‌శాంటో అహంకారంతో నిరాకరించినా ప్రభుత్వం, ఎటువంటి చర్యలూ తీసుకోలేక పోవటం, పాలకుల లొంగుబాటుతనాన్ని బహిర్గతపర్చింది. రైతాంగం, కమీషన్ సుదీర్ఘకాలం జరిపిన పోరాటం వలన కొందరి రైతులకైనా మోన్‌శాంటో చివరికి పరిహారం చెల్లించకతప్పలేదు. నష్టపరిహారం యిప్పించే దమ్ము పాలక ప్రభుత్వాలకు లేదన్న విషయం దీనిద్వారా బయటపడింది.

### నాసిరకం పురుగుమందులు

నాసిరకం విత్తనాలతోనే కాకుండా, నాసిరకం పురుగుమందుల వలన కూడా రైతాంగం ఎక్కువగా నష్టపోతున్నారు. మార్కెట్‌లో నకిలీ పురుగుమందులు కుప్పలు, తెప్పలుగా వచ్చిపడుతున్నా, ఏది నాణ్యమైనదో, ఏది నాసిరకందో తెలియక రైతాంగం అయోమయానికి గురౌతున్నారు. వ్యవసాయశాఖ పరిశోధనల్లో నాసిరకం పురుగుమందులు ఎక్కువ మొత్తంలో బయటపడుతున్నాయి.

1966లో ప్రవేశపెట్టిన హరితవిప్లవం వలన అధిక దిగుబడులకోసమని విదేశాలనుండి హైబ్రీడ్ విత్తనాలు దిగుమతి చేసుకోవటం జరిగింది. ఈ విత్తనాలతోపాటు, వాటినుండి సంక్రమించే అనేక కొత్త చీడ-పీడలు దేశంలోకి దిగుమతి అయ్యాయి. ఈ చీడల నివారణకు విదేశీ కంపెనీలే పురుగుమందులను ఉత్పత్తిచేసి విక్రయాలు ప్రారంభించాయి. పురుగుమందులు వాడకుండా పంట దిగుబడులు రావటం అసాధ్యంగా మారింది. ఫలితంగా మన సేద్యంలో పురుగు మందుల వాడకం విడదీయని బంధం అయ్యింది. ప్రపంచంలో పురుగు మందులను అధికంగా వాడే దేశాల్లో భారత దేశం ప్రముఖ స్థానంలో ఉంది. దీని ఫలితంగా దేశంలో, రాష్ట్రంలో నాసిరకం పురుగుమందుల ఉత్పత్తీ అదే స్థాయిలో సాగుతున్నది. రాష్ట్రంలో సుమారు 90 కంపెనీలు పురుగు మందులను తయారు చేస్తున్నాయి.

తమ ఉత్పత్తులను మార్కెట్ లోకి పంపేటప్పుడు అవి ఒక శాంపిల్‌ని వ్యవసాయ శాఖకు పంపాలి. వాటిని పరీక్షించటానికి, వ్యవసాయశాఖకు నెలరోజులు పడుతుంది. అంతవరకూ కంపెనీలు ఆగకుండానే, వాటి స్టాకునంతా డీలర్ల దగ్గరకు చేర్చటం, దాన్ని డీలర్లు రైతులకు విక్రయించడం జరిగిపోతున్నది. రైతాంగం వాటిని వాడి నష్టపోవటం జరుగుతున్నది.

రాష్ట్రంలో చేసిన పరీక్షలలో నాసిరకంగా వెల్లడైన పురుగు మందులు, పునఃపరీక్షలో నాణ్యమైనవని సర్టిఫై అవుతున్నాయి. తమ ఉత్పత్తి నాసిరకంగా తేలిన వెంటనే, ఆ కంపెనీ వారు పరిశోధనా అధికారులను ప్రలోభపెట్టి పునఃపరిశోధనల ఫలితాలను తమకు అనుకూలంగా మార్చుకొంటున్నారు.

గత నాలుగు సంవత్సరాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా 50 రకాల పురుగుమందులు నాసిరకమైనవని పరీక్షాకేంద్రాల్లో వెల్లడైయింది. గత అక్టోబర్ నెలలోనే 19 రకాల పురుగుమందులు నాణ్యత లేనివని తేలింది. కంపెనీలు తయారు చేసిన ఏడు రకాల పురుగు మందులను వ్యవసాయ శాఖ నిషేదించింది.

రసాయనిక ఎరువులు, పురుగుమందుల వలన అనేక అనర్థాలు ఏర్పడటం, తిరిగి రైతాంగం సేంద్రియ ఎరువుల, జీవ పురుగు మందుల వినియోగం వైపు మొగ్గుచూపుతున్నారు. వాటి వినియోగం కూడా పెరిగింది. ఇందులో నకిలీ ఉత్పత్తిదారులు తయారయ్యారు. జీవ పురుగు మందుల పేరిట రసాయన పురుగు మందులనే రైతులకు అంటగడుతున్నారు. మన రాష్ట్రంలో 250 కంపెనీలు బయో పురుగుమందుల పేరిట ప్రతి సంవత్సరం 500 కోట్ల ఖరీదైన నాసిరకం పురుగుమందులను రైతులకు అంటగడుతున్నారు.

రాష్ట్రంలోని బయో పురుగుమందుల ఉత్పత్తి కంపెనీలకు వేటికీ వ్యవసాయ శాఖ ధృవీకరణలేదు. వ్యవసాయశాఖ అధికారులు నమూనా శాంపిల్స్ పరీక్షిస్తున్నారా అంటే అదీ జరగటంలేదు. 2007 నుంచి ఇప్పటివరకు వ్యవసాయ శాఖకు 215 కంపెనీల నుంచి 1802 నమూనాలు అందగా అధికారులు ఉద్దేశపూర్వకంగానే పరీక్షలు జరపకుండా వ్యవహరిస్తున్నారు. దీనిపై కొందరు రైతులు గత సెప్టెంబరులో వ్యవసాయ శాఖకు ఫిర్యాదు చేశారు. గుంటూరు, అనంతపురం, హైదరాబాద్‌లలోని పురుగు మందుల పరీక్షా కేంద్రాల్లో పరీక్షించగా వాటిల్లో ఎమామక్టిల్ జెంజాయేచ్ అనే రసాయనం ఉన్నట్లు తేలగా, కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం ఊరుకుంటున్నది.

నాసిరకం విత్తనాలు, పురుగు మందుల విక్రయాలు సాగుతున్నాయని తెలిసి కూడా ప్రభుత్వం మిన్నకుండటం కూడా గమనించవలసినన విషయం. ఇదేదో చిన్న కంపెనీలు కక్కుర్తిపడి చేసే అక్రమంగా రైతాంగం భావించేటట్లు చేసి, బడా విదేశీ కంపెనీల సరుకే నాణ్యమైనదిగా భావించి, వాటి కొనుగోలు చేసేందుకు రైతాంగాన్ని నెట్టడం ద్వారా ఆ కంపెనీలకు అమ్మకాలు పెంచటమన్న ఉద్దేశ్యం దాగివుంది. పరీక్షా కేంద్రాలు నాసిరకం పురుగు మందులని తేల్చిన వాటిని అమ్మిన కంపెనీల్లో రాలీస్ ఇండియా, కోరమండల్ ఫర్టిలైజర్స్ వంటి పెద్ద సంస్థలూ ఉన్నాయి. ఇక మోన్‌శాంటో కంపెనీ సరఫరా చేసిన బిటి విత్తనాలూ నాసిరకమని తేలాయి. అయినప్పటికీ చిన్న కంపెనీలను తప్పించి గుత్తాధిపత్యం నెలకొల్పుకునేందుకు విదేశీ విత్తన కంపెనీలు తీసుకుంటున్న చర్యలకు ప్రభుత్వం మద్దతు తెలిపే విధానాలనే అనుసరిస్తున్నది.

ప్రైవేటు విత్తన కంపెనీలే కాకుండా, ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ (ఏ.పి. సీడ్స్) విక్రయిస్తున్న విత్తనాలు కూడా నాసిరకమైనవిగా బయటపడుతున్నాయి. ఏ.పి.సీడ్స్ దాని అనుబంధ సంస్థలు మాత్రమే సర్టిఫైడ్ విత్తనాలను రైతాంగానికి సప్లయ్ చేస్తున్నాయి. ఈ సంస్థ మేలు రకాలైన విత్తనాలను, తాను ఉత్పత్తి చేయటమే కాకుండ, రైతాంగం ద్వారా కూడా ఉత్పత్తిచేయించి, తనకు కేటాయించిన విత్తనాలను విక్రయించాలి. ఏ.పి.సీడ్స్ ప్రస్తుతం, తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించటం లేదు. నామమాత్రమైన ఉత్పత్తులతో సరిపెట్టి, అత్యధిక భాగం కంపెనీల నుండి, రైతుల నుండి సేకరించి వాటినే సర్టిఫై విత్తనాలుగా చలామణి చేస్తున్నది. విత్తనాభివృద్ధి సంస్థపై నమ్మకంతో విత్తనాలు కొంటున్న రైతాంగం, అది విక్రయిస్తున్న విత్తనాలు నాసిరకంగా ఉండటంతో ఏ.పి.సీడ్స్‌పై నమ్మకం కోల్పోతున్నారు.

నాసిరకం విత్తనాలు, పురుగు మందులను అరికట్టడంలో విఫలమైన పాలకుల విధానాలకు వ్యతిరేకంగానూ, దేశీయ, విదేశీ బడా కంపెనీలకు వ్యతిరేకంగానూ దేశీయ విత్తన ఉత్పత్తి, సాంప్రదాయ పురుగుమందుల ఉత్పత్తి చేపట్టాలని, నాసిరకం తయారీ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలనీ రైతాంగం ఉద్యమించాలి. అప్పుడే వాటిని నివారించటం సాధ్యమౌతుంది.

S

## కా॥ భోగాదుల రామారావు వర్ధంతి సభ

**బందరు, 13-12-10 :**

**అమరుడు** కా॥ భోగాదుల రామారావు వర్థంతిని పురస్కరించుకొని జడ్‌పి సెంటరు ఓగేసుపేటలలో కా॥ భోగాదుల రామారావు స్థూపంవద్ద సిపిఐ (ఎం-ఎల్) ఆధ్వర్యంలో వర్థంతి సభ జరిగింది. సిపిఐ(ఎం-ఎల్) నాయకులు కా॥ జె. జగన్ ఈ సభకు అధ్యక్షత వహించగా కా॥ రామారావు చిత్రపటానికి కా॥ తలసిల లీలామనోహర్ పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. సిపిఐ(ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥ యద్ధనపూడి సోని ఎర్రజెండాను ఆవిష్కరించి ప్రసంగిస్తూ కా॥ రామారావు చేసిన ఆదర్శప్రాయ కృషి, త్యాగపూరిత జీవిత స్మృతులను గుర్తు చేస్తూ జోహార్లు చెప్పారు. 'జల్' తుఫాన్ తాకిడికి గురై పాడైన ధాన్యాన్ని కొనేనాధుడే లేక దిక్కుతోచని స్థితిలో రైతాంగం, తమహక్కుల సాధనకై ఉద్యమిస్తున్న ఉద్యోగులు, 104 సిబ్బంది, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని ఉపాధ్యాయులు, ఈ రకంగా సమస్యలతో సతమతమవుతున్న వారి గురించి పట్టించుకోకుండా నాయకులు పదవులకోసం ప్రాకులాడటం జుగుప్సాకరంగా వుందనీ అంతరాలు పెరిగిపోతున్న ఈ రోజుల్లో ప్రజల దైనందిన సమస్యలు పరిష్కరించుకోవాలన్నా ఆందోళనే పరిష్కార మార్గమని ఉద్బోధించారు. రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.)జిల్లా నాయకులు కా॥ తలసిల లీలామనోహర్, పామర్తి అంజమ్మ, కొప్పినేని ఉమా మహేశ్వరరావు, ఏపిఎఫ్‌టియు నాయకులు కా॥ ముచ్చు సుధాకర్‌రావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు కా॥ యర్రంశెట్టి రామ్మోహనరావులు కా॥ భోగాదుల రామారావును స్మరించుకుంటూ పాలకుల దోపిడీ విధానాలను ఎండగట్టారు.

S

# ముంపు రైతాంగ సమస్యల పరిష్కారానికై ఆందోళన



**దొండపూడి, 11-12-10 :**

**రైతుకూలీ సంఘం** (ఆం.ప్ర.) రాష్ట్ర పిలుపు మేరకు ముంపురైతాంగ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ పశ్చిమగోదావరిజిల్లా పోలవరంమండలం దొండపూడిలో ఏజన్సీ గిరిజన సంఘం (రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) అనుబంధం) ఆధ్వర్యంలో 200 మందికి పైగా గిరిజనులు, దళితులు, రైతులు, ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బంద్, రాస్తారోకో నిర్వహించారు. గ్రామం అంతటా ఊరేగింపు జరిపారు.

ముందు రోజు (10-12-2010న) 100 మందికిపైగా బృందాలుగా కరపత్రాలు పంచుతూ ప్రచారం చేసారు. ఈ కార్యక్రమానికి ఏజన్సీ గిరిజన సంఘం నాయకులు కామ్రేడ్ కలుం గంగాదేవి, సవలం రాంబాబు తదితరులు నాయకత్వం వహించారు.




పోలవరంలో ప్రదర్శన

**పోలవరం, 11-12-10 :**

గిట్టుబాటు ధరలకై రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్రవ్యాపితంగా ఆందోళన చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా మండల కేంద్రమైన పోలవరంలో ఏజన్సీ గిరిజన సంఘం (రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) అనుబంధం) ఆధ్వర్యంలో గిరిజనులు, రైతుకూలీలు ప్రదర్శన చేసి, గంటసేపు రాస్తారోకో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఏజన్సీ గిరిజన సంఘం నాయకులు కామ్రేడ్స్ సున్నంరాజు, కొవ్వాసి పొట్టిదొర, పద్దం కృష్ణమూర్తి, మిడియం రవిదొర తదితరులు నాయకత్వం వహించారు.

**ప్రత్తిపాడు, 11-12-10 :**

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర పిలుపులో భాగంగా గుంటూరు జిల్లా మండల కేంద్రమైన ప్రత్తిపాడులో ధాన్యానికి గిట్టుబాటు ధరను కల్పించాలని, ముంపు గ్రామాల రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో ప్రచారం చేస్తూ విస్తృతంగా కరపత్రాలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు కా॥ సింహాద్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎడతెరిపిలేకుండా వానలు, వరదలు, జల్ తుఫాన్ వంటి విపత్తులతో రైతులు పంట నష్టపోతే ఆపదలో ఉన్నవారిని ఆదుకోకుండా ప్రజలకు పట్టెడన్నం పెట్టే రైతులకు ముష్టివేస్తామని పాలక వర్గాలు మాట్లాడటాన్ని తీవ్రంగా నిరసించారు. నోటికాడికి వచ్చిన కూడు నీటిపాలై గుండె ధైర్యాన్ని కోల్పోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే, రైతులు కేవలం డబ్బులు కోసమే ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పాలకవర్గాలు ఆహంభావంతో మాట్లాడుతున్నారన్నారు. వరదల కారణంగా రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ముంపు గ్రామాల రైతులకు ఎకరానికి 15000లు ఇవ్వాలని, బ్యాంక్ రుణాలను రద్దుచేసి, కొత్త రుణాలు ఇవ్వాలని, క్వింటా ప్రత్తికి 5000 రూ., వరికి 1500 రూ. ఇంకా అన్ని పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యవర్గ సభ్యులు దూపాటి శ్రీను, రైతుకూలీ సంఘం నాయకులు చెన్నుపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు.

**బుక్కరాయసముద్రం, 11-12-10 :**

ముంపు రైతుల సమస్యపై అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండల కార్యాలయం ఎదుట రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో సంఘంజిల్లా సభ్యుడు కా॥ ఏ. నాగభూషణం అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘీభావంగా ఏపిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కా॥ సి. పెద్దన్న పాల్గొన్నారు. ధర్నాలో సిద్దిరాంపురము రైతాంగం, రైతు కూలీలు, చుట్టు ప్రక్కల గ్రామాల్లోని రైతులు, రైతుకూలీలు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కా॥ నాగభూషణం మాట్లాడుతూ రైతుల బ్రతుకులు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయనీ అతివృష్టి అనావృష్టి వలన రైతులు అనేక కష్టాలకు గురయ్యి చివరికి ఆత్మహత్యలు చేసుకోవడానికి పూను కుంటున్నారనీ, ఇంత జరిగినా ప్రభుత్వం ఏ విధమైన నివారణ చర్యలు చేపట్టకుండా నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని రైతుల సమస్యలపై ఉద్యమించి సాధించుకోవలసిన పరిస్థితి ఎంతైనా వున్నదన్నారు.

కా॥ పెద్దన్న మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల సమస్యల గురించి పాలక వర్గాలు, పెట్టుబడుదారులు వ్యవహరిస్తున్న తీరు ఇప్పుడు ప్రజలందరికీ స్పష్టమౌతున్నదన్నారు.

మరోవైపున నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశమంటుతున్నాయనీ ధరల దాటికి సామాన్య ప్రజలు నలిగి పోతుంటే మధ్యన దళారి వర్గాలు, పెట్టుబడి దారులు, ప్రభుత్వ సహకారంతో ప్రజల సొమ్ములు దోచుకొని లక్షలు గడిస్తున్నారనీ ధరల తగ్గింపు కొరకు అన్ని వర్గాల ప్రజలు మరింత సమరశీల పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు.

ఈ సభకు ఎం.ఎస్. నగర్ నుంచి భవన కార్మిక సంఘం ఉపాధ్యక్షులు టి. నాగరాజు, రైతుకూలీ సంఘం గ్రామకమిటీ సిద్దిరాంపురం ఉపాధ్యక్షులు కె. నారాయణ, మరుట్ల ఆంజనేయులు, మహిళా సంఘం నాయకులు టి. పుల్లమ్మ, చెన్నమ్మ, నాగేశ్వరమ్మ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. తరువాత మండల తహాశీల్దారు గారికి మెమోరాండం అందజేశారు.

# కామ్రేడ్ సుభానికి జోహార్లు!

**పిడుగురాళ్ళ, 13-12-10 :**

**సిపిఐ** (ఎం-ఎల్) పార్టీసభ్యుడు, పిడుగురాళ్ళ పట్టణంలోని లెనిన్ నగర్ కాలనీ అభివృద్ధి కమిటి కార్యకర్త కా॥ సుభాని అనారోగ్యం కారణంగా 2-12-10న మరణించాడు.

కా॥ సుభాని సంస్మరణ సభ స్థానిక లెనిన్‌నగర్ లోని కా॥ విశ్వమోహనరెడ్డి భవన్‌లో జరిగింది. సభకు హాజరైన కాలనీ ప్రజలు, పార్టీ కార్యకర్తలు అందరూ మొదటగా కా॥ సుభాని కృషిని స్మరించుకుంటూ 2ని॥లు మౌనం పాటించారు. అనంతరం సభనుద్దేశించి రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ కె. ముసలయ్య మాట్లాడుతూ కా॥ సుభాని సంఘ కార్యక్రమాల్లో చురుకైన కార్యకర్త అని అన్నారు. తన కుటుంబ పోషణకు అవసరమైన వృత్తిని తాను చేసుకుంటూ మిగిలిన సమయమంతా 'సంఘం' ఇచ్చిన బాధ్యతల నిర్వహణకు వెచ్చించేవాడని అన్నారు. కార్యకర్తల భోజన అవసరాలు చూడడంలోను, కార్యక్రమాల సందర్భంగా ప్రచార కృషిలోనూ అప్పగించిన ప్రతి పనీ పూర్తి అయ్యేవరకు విశ్రమించక బాధ్యతతో శ్రమించేవాడని గుర్తుచేశారు. అభివృద్ధి కమిటీ సభ్యులు మరియు సభకు హాజరైన వారంతా కా॥ సుభానీ కృషిని ముందుకు కొనసాగించటమే, ఆ కామ్రేడ్‌కు అర్పించే నివాళి అన్నారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ ఎన్. రాంబాబు మాట్లాడుతూ కా॥ సుభాని తన జీవితకాలంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూనే ప్రజలకోసం, కమ్యూనిస్టు పార్టీ కోసం పనిచేశాడని అతని కృషి పేర్కొనదగినది అన్నారు. దేశంలో దోపిడీ వర్గం ఆధిపత్యంలో ఉందని, అందుచేతనే ప్రజలు నిత్యం అధికధరలు, నిరుద్యోగం, గిట్టుబాటు ధరల సమస్యల నెదుర్కొంటూ ఆకలిచావులు, ఆత్మహత్యల పాలవు తున్నారని అన్నారు. లక్షలకోట్ల కుంభకోణా లలో పాలకవర్గాలు మునిగితేలుతూ దేశాన్ని సామ్రాజ్య వాదులకు, విదేశీ బహుళజాతి కంపెనీలకు తాకట్టు పెడుతున్నారని, పాలకవర్గ విధానాలకు వ్యతిరేకంగా పోరాడి దోపిడీ పీడనలతో నిండిన ఈ వ్యవస్థనుకూల్చి నూతన సమాజాన్ని ఏర్పరచుకున్నపుడే ప్రజలంతా సుఖశాంతులతో జీవించగలుగుతారని, ఈ దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలో తనవంతు పాత్రను నిర్వహిస్తూ ఆ క్రమంలో మరణించిన కామ్రేడ్ సుభానికి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటి సభ్యులు గురవయ్య, ఇస్రాయిల్, జోజి, గాంధి, హస్నాబాద్ నవయువ సమాఖ్య లెనిన్‌నగర్ కమిటి సభ్యులు ఎస్‌కె. జాని, రాజా, శివ, వెంకయ్య, స్త్రీవిముక్తి సంఘటన నాయకులు కా॥ ఎం. నిర్మల తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# అధిక ధరలపై ఆందోళన



అనంతపురంలో అధిక ధరలపై ఆందోళన

**అనంతపురం, 8-1-11 :**

నిత్యావసర వస్తువుల ధరల పెంపుదలకు కారణమైన పాలకులపై సమరశీల పోరాటాలు సాగించాలని స్త్రీవిముక్తి సంఘటన పిలుపు మేరకు అనంతపురం జిల్లాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్ నుండి క్రిష్ణ కళామందిర్ మీదుగా టవర్‌క్లాక్ వద్దకు ప్రదర్శన నిర్వహించారు. సామ్రాజ్యవాదుల, బడావ్యాపారుల, దళారుల ప్రయోజనాలు నెరవేర్చే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా పెరిగిన నిత్యావసర వస్తువులు - ముఖ్యంగా ఉల్లి, నూనె, చింతపండు మరియు వంటగ్యాసు, పెట్రోలు,డీజిలు-ఇంకా నిత్యమూవాడే కూరగాయలధరల అనూహ్య పెరుగుదలకు నిరసనగా మహిళలు తమ మెడలో కూరగాయలను దండగావేసుకొని ఊరేగింపులో పాల్గొన్నారు.

టవర్‌క్లాక్ వద్ద వినూత్న రూపంలో రోళ్ళు, రోకళ్ళతో టమోటా, ఒక వెల్లుల్లి, ఒక ఎర్రగడ్డ, ఒక పచ్చిమిరప కాయ రోట్లో వేసి దంచుతూ, ఈ ప్రభుత్వ విధానాలను దుయ్యబడుతూ తమ బాధను, ఆగ్రహాన్ని ఈ రూపంలో వ్యక్తంచేశారు.

సంస్థ జిల్లా కన్వీనర్ కా॥ భూదేవి మాట్లాడుతూగత సం॥కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు అనూహ్యంగా పెరిగిపోతూ సామాన్యులకే కాదు, మధ్యతరగతి ప్రజలకు కూడా అందుబాటులో లేవనీ, ప్రజల ఈ సమస్యలను పరిష్కరించకుండా పాలకులు తమ ముఠాల కుమ్ము లాటల్లో మునిగి తేలుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమములో స్త్రీవిముక్తి సంఘటన జిల్లా కన్వీనర్, కా॥ ఎన్. భూదేవి, పట్టణ నాయకులు కె. శ్రీలక్ష్మి, రమాదేవి, నాగలక్ష్మి, శిల్ప, పార్వతి తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. వై.కొత్తపల్లి, శిథిలాపురం, స్టాలిన్ నగర్, ఎం.ఎస్.నగర్‌లనుండి మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు.

# పెట్రోధరల పెంపుకు నిరసన

**బందరు, 13-12-10 :**

పెంచిన పెట్రోలు ధరలు తగ్గించాలని, డీజిల్ ధరలు పెంచే ప్రతిపాదనను విరమించాలని, నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని డిమాండ్‌చేస్తూ ఏపిఎఫ్‌టియు అనుబంధ సంస్థ 'మచిలీపట్నం టౌన్ ఆటోవర్కర్స్ యూనియన్' ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. చిలకలపూడి నుండి పరాసుపేట, ప్రభుత్వ ఆసుపత్రి సెంటర్ వరకు ఈ నిరసన ప్రదర్శన జరిగింది.

ఈ సందర్భంగా ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కా॥ బెల్లంకొండ రవి ప్రసంగిస్తూ పెట్రోల్ ధరలు పెరగటంవల్ల రవాణా ఛార్జీలు పెరిగి, నిత్యావసర ధరలు పెరిగేందుకు కారణమవుతుందని, ఆయిల్ ధరల పెరుగుదల వల్ల ఆటో వర్కర్స్ ఇంకా ఇబ్బందులకు గురవుతారనీ, అధిక ధరలతో సతమతమవుతున్న ప్రజలకు ఆయిల్ ధరలు పెరగటం మూలిగేనక్కపై తాటి పండు పడ్డ చందంగా వుందనీ కావున పెట్రోలు ధరలను తక్షణమే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏపిఎఫ్‌టియు బందరు ఏరియా కోశాధికారి కా॥ ముచ్చు సుధాకరరావు ప్రసంగిస్తూ ఆయిల్ కంపెనీలకు నష్టాలు వస్తున్నాయని చెప్పడం అబద్ధమనీ, వాస్తవానికి 2004-05 సం॥లో 1,20,801 కోట్లు, 2009-10లో 1,38,204 కోట్లు ఆదాయం ప్రభుత్వానికి వచ్చిందని దీన్ని బట్టి చూస్తే నష్టాల పేరుతో ప్రజల జేబులను కొల్లగొట్టేందుకు ప్రభుత్వం పూనుకుందని తెలియజేశారు. ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు,కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యూనియన్ నాయకులు కా॥ సిహెచ్ శ్రీనివాసరావు, కుంభా నాంచారయ్య, కొండేటి మురళి, నవయువ సమాఖ్య బందరు ఏరియా కార్యదర్శి కా॥ జి. మల్లేష్ నాయకత్వం వహించారు.

## 'పరువు' హత్యలు... (5వ పేజీ తరువాయి)

**దళితులతో వివాహ సంబంధాలలోకి వెళ్ళటంతో ఈ హత్యలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ సహాయమంత్రి కృష్ణతీర్ధ ఆగస్టు 10న రాజ్యసభలో ప్రకటించటం గమనార్హం!**

ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో నవంబర్ 14న జరిగిన సర్వ ఖఫ్ మహా పంచాయత్ సగోత్రీకుల వివాహాల్ని నిషిద్ధంచేస్తూ హిందూ వివాహ చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేసింది. 'ఖఫ్' పంచాయితీలకు 'లోక్ అదాలత్' హోదానిచ్చి, ప్రభుత్వ జోక్యాన్ని నివారించాలని వారు డిమాండ్ చేశారు.

సగోత్రీకుల వివాహాలపై వ్యతిరేకత మాత్రమే ఈవిధమైన ఆటవిక చర్యలకు ప్రేరేపిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంలోనూ వాస్తవం లేదు. ఖఫ్ పెద్దల అనుమతి లేని ఏ వివాహం చేసుకున్న వారినైనా ఇలా చంపివేయటం జరుగుతూవస్తున్నది.

రోజూవారీగా ఈ 'పరువు' హత్యలు సాగుతూనే వున్నా అధికారంలో వున్న పాలనాధిపతులు వీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోకపోగా జాప్యం చేసే వైఖరి తీసుకుంటున్నారు. ఇంతటి దుర్మార్గమైన 'పరువు' హత్యల నివారణకు చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు మంత్రి వర్గంలోనే ఏకాభిప్రాయానికి రాకపోవటమనేది, వీరిపై 'ఖఫ్' పంచాయితీల పట్టు ఎంతగావుందో తెలియజేస్తున్నది. ఈ కారణం పేరిట ప్రధానమంత్రి ఈ సమస్యపై అధ్యయనం చేసేందుకు, ప్రతిపాదనలను సిద్ధం చేసేందుకు 'మంత్రుల బృందానికి' ఈ సమస్యను అప్పగించటమనే రూపంలో మరింతగా సాగదీసే చర్యలు మినహా పాశవికమైన హత్యలను నిర్ద్వంద్వంగా ఖండించలేక పోతున్నారు. వాటికి కారకులైన వారిపై కఠినమైన చర్యలు చేపట్టేందుకు సాహసించలేక పోతున్నారు. హర్యానా ముఖ్యమంత్రి భూపేందర్ సింగ్ హుడా, రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యుడు నవీన్ జిందాల్ ఈ అమానుష హత్యలకు అదేశాలు జారీచేస్తున్న ఖఫ్ పంచాయితీలను ఆకాశానికెత్తుతూ మాట్లాడటాన్ని గమనిస్తే పాలకపార్టీల నాయకులు ఖఫ్ పంచాయితీలతో ఎంతగా మమేకమయ్యారో అర్థమౌతుంది.

దేశ వ్యాపితంగా దళితులపై వేధింపులు, దౌర్జన్యాలు, దాడులు జరగటమనేది ప్రస్తుత సమాజపు అర్ధభూస్వామ్య స్వభావాన్ని స్పష్టం చేస్తున్నది. భూస్వామ్య, అగ్రకుల, సంపన్నలకు, పెత్తందారులకు గ్రామీణ ప్రాంతాలలో వున్న పట్టును తెలియజేస్తున్నది.

వీరు మధ్యయుగాలనాటి కరుడగట్టిన మనువాద కుల వ్యవస్థను నిలిపివుంచటం ద్వారా తమ దోపిడీని సజావుగా కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారు.

సాంప్రదాయకవాదం పేరిట అగ్రకుల, భూస్వామ్య వర్గాలు సాగించే ఈ దుర్మార్గాలనీ, సామ్రాజ్యవాద సంస్కృతి పేరిట యువతీయువకుల విచ్చలవిడితనాలనీ వ్యతిరేకిస్తూ ఒక ప్రజాస్వామికమైన సమానత్వ భావాలు పరిమళించే సమాజం కోసం సంఘటితపడాలి. భూస్వామ్య, సామ్రాజ్యవాద విషసంస్కృతులకు వ్యతిరేకంగా ఆచరణ, భావజాల రంగాలలో పోరాటాన్ని తీవ్రంచేయాలి.

S

# 'పెరిగిన ధరలు-ఛిద్రమౌతున్న కార్మిక జీవితాలు' అంశంపై సదస్సు

**నర్సంపేట, 13-12-10 :**

వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్‌లో రైస్ మిల్లులలో పని చేస్తున్న హమాలీల కూలీ రేట్లను పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా హమాలీ కార్మిక సంఘం (ఏపిఎఫ్‌టియు అనుబంధం) ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు.

పెరిగిన ధరల కారణంగా కుటుంబాలపై అధనపు భారం పడి ఆర్ధిక ఇబ్బందులతో సతమతమవుతూ కార్మికులు తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'పెరిగిన ధరలు, ఛిద్రమవుతున్న కార్మిక జీవితాలు' అనే అంశంపై ఏపిఎఫ్‌టియు నాయకులు కా॥ భైరబోయిన ఐలయ్య అధ్యక్షతన స్థానిక వాసవి కళ్యాణ మండపంలో జిల్లాసదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఏపిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కా॥ పెద్దన్న హాజరై ప్రసంగిస్తూ మన రాష్ట్రంలో, దేశంలో అసంఘటిత రంగంలో పని చేయుచున్న కోట్లాదిమంది కార్మికులు ఎలాంటి హక్కులూ లేకుండా తమ రక్తాన్ని చెమటగా మార్చి శ్రమ చేస్తూంటే, ఆ శ్రమకు తగిన ఫలితాన్ని యాజమాన్యాలు ఇవ్వటం లేదన్నారు. ఇస్తున్న కొద్దిపాటి వేతనాలలో సైతం కోతను విధిస్తూ కార్మికుల జీవితాలను దుర్భరం చేస్తున్నారనీ, మనం ఎన్నో సంవత్సరాలుగా సాధించుకున్న కార్మికుల హక్కులను హరించివేస్తున్నారనీ, ఈ కార్మికుల సంక్షేమం కోసం ఉన్న చట్టాలు, యజమానులకు చుట్టాలుగా మారిపోయాయనీ, వారు ఇచ్చే లంచాలు మరిగిన కార్మికశాఖ అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనీ, దీనితో కార్మికుల జీవితాలు మరింత అధ్వాన్నంగా తయారు అవుతున్నాయనీ అన్నారు.

ప్రధానంగా రైస్ మిల్లులలో పనిచేస్తున్న హమాలీ, కూలీ, వర్కర్స్, డ్రైవర్ కార్మికులు ఆ ఫ్యాక్టరీలు వెదజల్లుతున్న కాలుష్యం మూలంగా ఊపిరితిత్తుల జబ్బులకు గురై తమ ప్రాణాలు కోల్పోతున్నారనీ, ఇన్ని ఇబ్బందులను ఎదుర్కొంటూ పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం ఇవ్వటంలేదనీ దీనికి తోడు పెరుగుతున్న ధరల మూలంగా కనీసపాటి ఆహారం కూడా కార్మికునికి లభించటంలేదన్నారు.

ఈ పరిస్థితులలో సంఘటితంగా, ఐక్యంగా నిలబడి తమ శ్రమకు తగిన ఫలితాన్ని సాధించుకొనుటకు కార్మికవర్గం పోరాడాలని కా॥ పెద్దన్న పిలుపు నిచ్చారు. ఇంకా ఈ సదస్సులో ఏపిఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి కా॥ మోడెం మల్లేషం, రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ ఎం.డి. యాకూబ్, ఎన్‌వైఎస్ జిల్లా కన్వీనర్ కా॥ ఈర్ల పైడి మాట్లాడారు.

అనంతరం 600 మంది కార్మికులతో అంగడి సెంటర్ నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి ఆర్‌డిఒ కార్యాలయం ముందు ధర్నా జరిపి పలు డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని ఆర్‌డిఒకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో వివిధ రైసుమిల్లుల నుండి హమాలీ పెద్దమనుషులు పాల్గొన్నారు. ప్రజా కళాకారులు పాడిన పాటలు కార్మికులను ఆకట్టుకున్నాయి.





నర్సంపేట కార్మిక సదస్సులో ప్రసంగిస్తున్న కా॥ పెద్దన్న; కార్మిక ప్రదర్శన

# 'కార్మికుల హక్కులు-చట్టాలను ఉల్లంఘిస్తున్న పాలకులు' అంశంపై సదస్సు

**బందరు, 4-11-10 :**

**ఏపిఎఫ్‌టియు** మచిలీపట్నం శాఖ ఆధ్వర్యంలో స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం హాలులో "కార్మికుల హక్కులు-చట్టాలను ఉల్లంఘిస్తున్న పాలకులు" అన్న అంశంపై సదస్సును నిర్వహించారు. సదస్సుకు ఏపిఎఫ్‌టియు పట్టణ అధ్యక్షుడు కా॥ బెల్లంకొండ రవి అధ్యక్షత వహించారు. సదస్సుకు ముఖ్యవక్తగా విచ్చేసిన ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కా॥ వి. కిషోర్ ప్రసంగిస్తూ కార్మికులు పోరాడి సాధించుకున్న 23 కార్మిక సంక్షేమ చట్టాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తూ క్రమంగా రద్దుచేసేవైపుగా ప్రభుత్వం పూనుకొంటోందనీ అసంఘటిత కార్మికుల్లో అత్యధికులు నిరక్షరాశ్యులనీ, ప్రభుత్వ అధికారులుగాని, పాలకవర్గ కార్మిక నాయకులుగానీ కార్మిక సంక్షేమ చట్టాలపట్ల సరైన అవగాహన కల్పించకుండా వుంటున్నారనీ, తద్వారా యాజమాన్యం కార్మికులను మరింతగా శ్రమదోపిడికి గురిచేస్తున్నారనీ, చట్ట సౌకర్యాల అమలు కోసం కోర్టులను ఆశ్రయించినా కార్మికులకు ప్రయోజనం లేదనీ, కోర్టులు, చట్టాలు కలవారి చుట్టాలవడం వల్ల కార్మికులకు ద్రోహం జరుగుతోందనీ, ఈ స్థితిలో పోరాడి సాధించుకొన్న కార్మిక సంక్షేమ చట్టాల అమలు కోసం, శ్రమ దోపిడి నుండి విముక్తి కోసం ఉద్యమించాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కా॥ యద్దనపూడి సోని ప్రసంగిస్తూ ఆటో కార్మికులు, ముఠాకార్మికులు పెరిగిన అధిక ధరలవల్ల ఆదాయం సరిపోక అభద్రతకు గురవుతున్నారనీ, 2జి స్పెక్ట్రమ్‌వంటి అనేక కుంభకోణాలకు పాల్పడే పాలకుల నుండి కార్మికుల సంక్షేమాన్ని ఆశించలేమనీ వెయ్యిమంది ఉంటే తప్ప కార్మిక సంఘాన్ని పెట్టడానికి వీల్లేదంటున్నారనీ, ఈ రకంగా పాలకులు కార్మికుల హక్కులను హరింపజేస్తూ యాజమాన్యాల ప్రయోజనాలను కాపాడుతున్న ఈ పరిస్థితుల్లో కార్మికులు సంఘటితపడి ఉద్యమించాలని విజ్ఞప్తి చేసారు.

ఇంకా బందరు పట్టణ పరిరక్షణ సమితి కన్వీనర్ బి. సత్యనారాయణసింగ్, ఎపిఎఫ్‌టియు పట్టణ కార్యదర్శి ముచ్చు సుధాకరరావు-కార్మిక హక్కులను, చట్టాలను ఉల్లంఘిస్తున్న పాలకుల విధానాలను దుయ్యబట్టారు. ఆటోవర్కర్లు, ముఠాకార్మికులు పట్టణంలో వివిధ యూనియన్ల నుండి ఈ సదస్సులో పాల్గొన్నారు. ప్రజాకళాకారులు కార్మిక పోరాట పాటలను ఆలపించారు. ⇨




బందరు సదస్సులో ప్రసంగిస్తున్న కా॥ కిషోర్

# ఆదివాసుల సమస్యలపై ఐటిడిఏ కార్యాలయంవద్ద ధర్నా





పార్వతీపురంలో గిరిజనుల ధర్నా – ధర్నాలో ప్రసంగిస్తున్న కా॥ ఝాన్సి

**పార్వతీపురం, 3-1-11 :**

తుఫాన్‌ల వలన నష్టపోయిన గిరిజన రైతులను వెంటనే ఆదుకోవాలని, ప్రతి గిరిజన కుటుంబానికి 10వేలరూపాయల తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేస్తూ పార్వతీపురం ఐటిడిఏ ఆఫీసువద్ద రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది.

ఈ సంవత్సరం వరుస తుఫాన్‌ల ప్రభావం వలన పోడు పంటలైన చోడి, జొన్న, సామలు, ఊదలు, జనుములు తదితర పోడు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అటవీ ఉత్పత్తుల దిగుబడులు కూడా తగ్గే పరిస్థితి ఏర్పడింది. ఏజన్సీ ప్రాంతంలో ఈ పరిస్థితి పైన నేటికీ సర్వేలు జరపడంగానీ, పంట నష్టపరిహారాల గురించి మాట్లాడటంగానీ చేయక పోవడంతో గిరిజనులను ప్రత్యేకంగా అభివృద్ధి చేయడానికి,గిరిజనుల సమస్యలను పరిష్కరించడానికి ఏర్పాటు చేయబడ్డ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఏ) నిర్లక్ష్యవైఖరిని నిరసిస్తూ రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా కమిటీ ధర్నా కార్యక్రమానికి పిలుపు నిచ్చింది. ఏజన్సీ ప్రాంత కొండలపైన గ్రామాలలో వున్న గిరిజనుల సమస్యలను, పంటలకు జరిగిన నష్టాన్ని పరిశీలన జరిపింది. గిరిజనుల యొక్క సమస్యలను వివరిస్తూ కరపత్రాలు ప్రచురించి గ్రామాలలో, గిరిజన సంతలలో విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించింది.

## పార్వతీపురంలో కదం తొక్కిన గిరిజనులు

పార్వతీపురం రైల్వే స్టేషన్ నుండి గిరిజన సాంప్రదాయక నృత్యాలతో, డప్పుల చప్పుళ్ళతో, ఎర్రజెండాల రెపరెపలతో ప్రదర్శన జరిగింది. తుఫాన్‌ల వలన నష్టపోయిన గిరిజన రైతులను ఆదుకోవాలని, ఏజన్సీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని అమలు చేయాలని, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలని, ఏజన్సీలో కనీస సౌకర్యాలైన మంచినీరు, విద్య, వైద్యం అందించాలని నినదిస్తూ పార్వతీపురం పట్టణ వీధుల్లో గిరిజనులు గళమెత్తారు. ప్రదర్శనకు ముందు భాగాన ఈ ధర్నా కార్యక్రమానికి హాజరైన రైతు కూలీసంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ సింహాద్రి ఝాన్సీ, జిల్లా కార్యదర్శి కా॥ డి. వర్మ, రాష్ట్ర కమిటి సభ్యులు కా॥ తాండ్ర అరుణ నడిచారు.

## పోలీసు బలగాల మోహరింపు

ప్రదర్శన ప్రారంభంనుండీ పోలీసు బలగాలు పెద్దఎత్తున అనుసరించాయి. ర్యాలీకి అనుమతి పొందలేదని నాయకత్వాన్ని సతాయిస్తూ చివరకు ఐటిడిఏ కార్యాలయానికి ఊరేగింపు చేరే సమయానికి మరిన్ని బలగాల్ని రప్పించి కార్యాలయం గేటును మూసివేసారు. వేలాదిమంది గిరిజనులు కోపోద్రిక్తులై దిక్కులు పిక్కటిల్లేలా నినదించి ప్రాజెక్టు ఆఫీసర్ బయటకురావాలని, గేటును తెరవాలనీ డిమాండ్ చేశారు. పోలీసు అధికారులు, సంఘ నాయకత్వంతో చర్చలకు దిగి, పిఓ గారితో మాట్లాడి వస్తామని చెప్పారు. ప్రజా కళాకారుల పాటలతో ధర్నా ప్రారంభమైంది. 2గంటలపాటు వేచి చూచిన గిరిజనులు ఆసహనంతో ఒక్క సారిగా గేటును తోయడం, ఈలోపు పిఓ ఆఫీసు నుండి బయటకు వచ్చి నాయకులు ఇచ్చిన మెమోరాండం స్వీకరించడంతో ధర్నా ముగిసింది. ఈ అధికారి పార్వతీపురం ఐటిడిఏ బాధ్యతలు చేపట్టిన నాటినుండి తనను గిరిజనులు మాత్రమే కలపాలి తప్పితే గిరిజన ఉద్యమ ప్రతినిధులుగా మరెవ్వరూ తనను కలవరాదనే నిబంధనను అమలు జరిపాడు. రైతుకూలీ సంఘం ఆందోళనతో పీ.వో. దిగివచ్చి మెమోరాండం తీసుకున్నాడు.

ఈ ధర్నానుద్దేశించి రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే పెద్దఎత్తున గిరిజనులు ఉద్యమిస్తారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గిరిజనుల పట్ల పిఓ వైఖరిని ఖండించారు. గిరిజనుల అభివృద్ధి -పేపర్లుకు, ప్రచారానికి పరిమితమౌతున్నది తప్ప గిరిజనుల యొక్క మౌలిక సమస్యలేవీ నేటి వరకూ పరిష్కారం కాలేదని విమర్శించారు. శ్రీకాకుళ గిరిజనోద్యమం ఫలితంగా వచ్చిన 1/70 చట్టాన్ని అమలు చేయలేదని, నేటికీ గిరిజనుల భూమి సమస్య పరిష్కారం కాలేదనీ ఉద్యమాలద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని పిలుపునిచ్చారు. సాగు ఖర్చులు అధికమై, సంస్థాగత రుణసౌకర్యం లేక, రైతులు అప్పులభారంతో వుంటే, ఇటీవల భారీ వర్షాలతో పంట తీవ్రంగా నష్టపోయి కోలుకోలేని దశలో, ప్రభుత్వ సహాయం కానరాక, బలవన్మరణాలకు పాల్పడుతున్నారనీ, అయితే ఆత్మహత్యలు పరిష్కారంకాదనీ, పోరాడి సమస్యలు పరిష్కరించుకోవాలనీ పిలుపునిచ్చారు. రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కా॥ డి వర్మ మాట్లాడుతూ ఏజన్సీ ప్రాంతంలో వుండే సమస్యలపై ఎక్కడికక్కడ ప్రజల్ని కదిలించి గ్రామాలలో, మండలాల్లో అధికారులను నిలవేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మక్కువ, సాలూరు, కొమరాడ, పాచిపెంట, పార్వతీపురం, కురుపాం మండలాల నుండి 1500 మంది గిరిజనులు పాల్గొన్నారు. పనసభద్ర ఎమ్‌పిటిసి కొండలకామయ్య, కొడమ సర్పంచ్ మెల్లిక సిమ్మమ్మ, పెదశాఖ సర్పంచి చోడి చీపురమ్మ; రైతుకూలీసంఘం జిల్లా నాయకులు బొత్స నరసింగరావు, ఎం. భాస్కరరావు, పి. శ్రీనునాయుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని నాయకత్వం వహించారు.

⇨ వేతనాల పెంపుకోసం పెదకరగ్రహారం ప్రైవేట్ ఇన్‌వెస్టర్ సిష్టమ్ గోడౌన్ ముఠా కార్మికులు చేస్తున్న సమ్మెకు ఎపిఎఫ్‌టియు సంఘీభావం తెల్పుతోందనీ, యాజమాన్యం కార్మికులు కోరిన విధంగా వేతనాలను పెంచి సమ్మెను విరమింపజేయాలని, ఆటోవర్కర్స్‌పై రవాణా, పోలీసు అధికారులు పెడ్తున్న కేసులను అరికట్టాలనీ కేసుపెట్టబడిన ఆటోను నిలుపుస్థలంలో రోజుకు 15 రూ॥ అద్దె వసూలు చేయటాన్ని ఆపివేయాలని, ఆటోవర్కర్లు, ముఠా కార్మికులకు ఇఎన్ఐ, పిఎఫ్, ప్రమాదబీమా సౌకర్యాలు కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సం॥లో 283 రోజులు పనిచేసిన ముఠా కార్మికులను పర్మినెంట్ చేయాలనీ, పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గించాలని, అధిక ధరలను అరికట్టాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానాలను ఆమోదించింది.

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010